# HANNA KRUPA

**Christian Devotional Monthly Magazine**

సంపుటి : 7 సంచిక : 4

ప్రభువగు యెహోవాయే నాకు బలము

THE INTERNATIONAL CHURCH OF ... INDIA 1958

## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | పరవస్తు | 4 |
| నిత్యజీవజలము | నిత్యజీవజలము మాసపత్రిక సౌజన్యంతో | 6 |
| శాశ్వత రక్షణ | రెవ.డా॥కె.జోసఫ్, ఒంగోలు | 8 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్, చెన్నై | |
| | రెవ.డా॥పి.జె.పంచరత్నం, నంద్యాల | 10 |
| అత్యంత ప్రియమైన అమ్మ | శ్రీమతి బి.విమలారెడ్డి, హైదరాబాద్ | 12 |
| మదర్ తెరీసా | యడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| బ్రదర్ భక్తసింగ్ | డా॥ పి.చంద్రశేఖరరావు | 18 |
| సాక్ష్యము | షేక్ జయనాభీ | 20 |
| వారి బాటలో.... | రెవ. వి.వి.కె.శర్మ, బొబ్బిలి | 23 |
| సెప్టెంబర్ నెల ప్రశ్న | శ్రీ పంతగాని గ్రేషియస్, ఏలూరు | 25 |
| ప్రయాణంలో మజిలీ | కొడవటికంటి | 26 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 27 |
| ఏదినిజం?ఏదిఅబద్ధం? | వి.శేఖర్‌రెడ్డి, నెల్లూరు | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



## చందా వివరములు

సంవత్సర చందా : రూ.150
జీవిత చందా : రూ. 3000
పోషక చందా : రూ. 5000

**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప,
54-1-23 (A), కృపాదానంవీధి, క్లాపేట,
6వ లైను, ఒంగోలు- 1.


హన్నాకృప
ఆధ్యాత్మిక మాస పత్రిక


Founder :
**Kodavatikanti Emmanuel Rajendra,** B.A.,B.L.,

Editor :
**Nathaniel R. Kodavatikanti,** B.Th.,M.A.,(M.Phil)
Cell : 9908822365

Hon. Editor :
**A.N.R. Zakkam**
D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :
**Yadavalli Prasada Rao**
D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :
**Dr. Y.S. Purushotham Reddy**
Superintendent, Rajareddy Hospital
Pulivendula

**Rev. Dr. K. Joseph**
Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**
Director, Good News Messengers, Guntur

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : **10957294362**
బ్రాంచి నెం. : 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు
సెల్ : 9866716506

సంపాదకీయం

# నా కుటుంబము



భూమి ఫలవృక్షములను మొలిపింపగా అది మంచిదని దేవుడు చూచెను. వెలుగును చీకటిని వేరుపరచుటకు ఆకాశ విశాలమందు జ్యోతులను వుంచెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాల మంచిదిగ నుండెను.

దేవుడు సమస్తమును మంచిదిగా చేశాడు. ఆయన ముగింపులో చేసినది హవ్వను. సృష్టి కార్యము పూర్తయింది అనుకున్న తర్వాత ఆదాము సంతోషంగా కనిపించలేదు. అతనికి సంతోషం కలిగించటానికి తాను సృజించిన ప్రాణుల న్నిటిని ఆదాము దగ్గరకు తీసికొని వచ్చాడు. ఇంకా ఏదో వెలితి కనబడుతుంది. అందువలన ఆదాములో నుండి హవ్వను తయారుచేసి మానవ కుటుంబాన్ని తయారు చేసినప్పుడు ఆయన సంతృప్తి చెందాడు.

దేవుడు చేసిన కుటుంబములోని వారు పండుతినక ముందు ఎన్నివేల కోట్లమంది మరణము నెరుగని మానవులు ఈ భూమి మీద ఎంతమంది ఉన్నారో మనకు తెలియదు గాని, జీవముగల ప్రతి వానికి తల్లి అయిన 'నారి' హవ్వగా మారింది. ఆమె వలననే పాపము ఈ లోకములోనికి వచ్చి కుటుంబము విచ్ఛిన్నమయింది. ఏశావు తన ఇల్లు వదలి దేశ దిమ్మరి అయినాడు.

యేసుప్రభువు ఈ లోకానికి వచ్చుట ద్వారా సమస్త పాపములకు ప్రాయశ్చిత్తము జరిగి కుటుంబము సమాధాన పరచబడింది. సర్వసృష్టి అందులోని మానవులందరు ఒకే కుటుంబము అనుకొనకపోయినా, మానవజాతి మనుగడకు కుటుంబమే ప్రధానమైనది. కుటుంబాల ద్వారా సంఘము ఏర్పడింది. కొంతమంది దొంగలు కుటుంబాలుగా జీవించే చోటును సెటిల్‌మెంటు అన్నారు. కొందరు పూజారుల కుటుంబాలు కలిసి జీవించే చోటును అగ్రహారము అన్నారు.

ఒక ఊరిలో, ఒక వీధిలో ఎప్పుడూ తగదాలే. ఎందుకు? తగాదాలు కోరుకునే వారందరు అక్కడ చేరారు అన్నమాట. ఒక ఇంట్లో ఎప్పుడూ తగాదాలే. ఇంటికి వచ్చిన కోడలు అలాంటిది. ఆ కుటుంబములోని వారంతా సాధువులైనా, వచ్చిన కోడలుకు తగాదా లేనిదే తోచదు. అందుకనే పూర్వం వధువు కొరకు పరాయి యింటికి పోయేవారు కాదు.

మా ఎలిమెంటరీ రోజుల్లో మా పాఠ్యపుస్తకాలలో 'నీతి'కి ఎక్కువ ప్రాధాన్యత వుండేది. "అది మా పని కాదు" అనే పల్లకి బోయీల పాఠం, "మా తండ్రి కొరకు" అనే కుటుంబ నీతి కథ వుండేవి.

ఒక యింట్లో మనుమడు, తండ్రి, తాత వుండేవారు. తాత రోజూ భోజనానికి వచ్చేటప్పుడు అన్నం తినటానికి అతను మట్టి మూకుడు తెచ్చుకొని అన్నం పెట్టించుకొని వెళ్ళేవాడు. అయితే తండ్రి అతని పిల్లలు మంచి కంచు వాటిలో భోజనం చేసేవారు. ఆ యింట్లో మనుమనికి ఈ పద్ధతి నచ్చలేదు. నేటి తన తండ్రి రేపు తన ఇంట్లో తాత అవుతాడని తెలుసుకోవాలని ఒకరోజు తాతని మట్టిబొచ్చె పదిమందిలో జారవిడువమన్నాడు. తాత అలాగే చేసినప్పుడు ఆ మట్టి పాత్ర పగిలిపోయింది. మనుమడు పరుగెత్తుకొని వచ్చి 'అయ్యయ్యో తాత, రేపు మా నాన్నకి నేను భోజనం పెట్టటానికి మట్టి పాత్ర అయినా లేకుండా చేశావే' అన్నాడు.

నేననుకుంటాను ఎంత వృద్ధురాలైనప్పటికీ తన తల్లికి తను కొనే చీరకి తన భార్యకు తను కొనే చీరకు తారతమ్యాలు వుంటే తల్లిని తండ్రిని సన్మానించుము అనే ఆజ్ఞను మీరినట్లే. తన చిన్న కుమారుని ప్రేమించే ప్రేమకు తన తండ్రి యెడల చూపే ప్రేమకు బేధము కనపరచినా పై ఆజ్ఞను మీరినట్లే.

ఒక సంగతి మనం ఎప్పుడూ మరచిపోకూడదు. మనం స్త్రీగా పుట్టినా, పురుషునిగా పుట్టినా అది మన చేతిలో లేని పని. కాని మనమందరము కోరుకొనేది దీర్ఘాయుష్షు. ఆ దీర్ఘాయుష్షు దేవుడిస్తే మనం ముసలి వాళ్ళమవ్వాల్సిందే. కాబట్టి వృద్ధాప్యంలో సంతోషంగా వుండాలంటే ఇప్పుడు మన ఇంట్లో వున్న వృద్ధులను సంతోషంగా వుంచాలి.

'కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునైయున్నది'.

సాక్ష్యము

# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ 26

**" విహ్వ్య గోప్త్రారాం మహక్యాదధిన కర్యుంతి హన్వా యాన పర్యతాసీన్ "**

ప్రభువా నీ దాసుడనగు నాకు చూపించిన దర్శన భావమును చెప్పుము అని ప్రార్థించినప్పుడు, నా ప్రార్థనకు జవాబు ప్రభువిచ్చాడు. గత సంవత్సరమంతా మనం చేసిన ప్రార్థన ఫలించిందని నా భార్య అంటుండగా "నా బైబిలు అందుకో" అని, ఆమె అందించిన బైబిలు తెరచి 1పేతురు 2:5-7 మరియు 11 వచనము చదివాను. 'యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలుల ర్పించుటకు పరిశుద్ధ యాజకులుగ వుండునట్లు మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధఘమైన మందిరంగా కట్టబడుచున్నారు. ఏలయనగా ఇదిగో ముఖ్యమును ఏర్పరచ బడినదియు అమూల్యమునగు మూలరాతిని సీయోనులో స్థాపించుచున్నాను. ఆయన యందు విశ్వాసముంచువాడు ఏ మాత్రమును సిగ్గుపడదు అను మాట లేఖనమందు వ్రాయబడి యున్నది. విశ్వసించుచున్న మీకు ఆయన అమూల్యమైనవాడు విశ్వసింపని వారికైతే ఇల్లుకట్టువారు ఏ రాతిని నిషేదించిరో అదే మూలకు తలరాయి ఆయెను. మరియు అది అడ్డు రాయియు అడ్డు బండయు ఆయెను. ప్రియురాలా, మీరు పరదేశులును యాత్రికులునైయున్నారు గనుక ఆత్మకు విరోధముగా పోరాడు శరీరాశను విసర్జించుడి' అని వ్రాయ బడివుంది. ఈ వాక్యము చదివి ధైర్యము పొంది, ప్రయాణము నకు సిద్ధపడాలని నిశ్చయించుకున్నాను. హైదరాబాదు వెళ్తే ఎక్కడ వుండాలన్న ప్రశ్న ఎదురైంది. ఒక వారం రోజుల తర్వాత 'స్టార్ట్ ఇమ్మిడియట్లీ' అని రాజమండ్రి నుండి ఒక టెలిగ్రాం, కొయ్యలగూడెం నుండి ఇంకో టెలిగ్రాం వచ్చాయి. నేను వెంటనే ప్రయాణమై రాజమండ్రి మీటింగ్సుకు చూసు కొని, కొయ్యలగూడెం మీటింగ్స్ కొరకు వచ్చాను. అక్కడ ఐదు రోజులు మీటింగులు జరిగిన తర్వాత హైదరాబాద్ నుండి ఆ మీటింగ్స్‌కు వచ్చిన కొంతమంది విశ్వాసులు నన్ను పరామర్శించి నాతో మాట్లాడి "మీరు హైదరాబాద్‌లో వుంటే చాలా బాగుంటుందండీ" అని అన్నారు. "ప్రభువు చిత్తాన్ని కనిపెడదామండీ" అని అన్నాను నేను. ఇది ప్రభువు తెరచిన మార్గమేమో అనుకున్నాను నేను. అక్కడ ఆ సభలో వున్నన్ని రోజులూ ఆ విషయమై బాగా ప్రార్థన చేశాను. హైదరాబాద్ నుండి వచ్చిన వారిలో ఒక సహోదరుడు తన భార్యతో కలసి నా దగ్గరకు వచ్చి "బ్రదర్ మీటింగ్స్ అయిపోయాక మీరు ఎక్కడికి వెళ్తారు?" అని అడిగాడు. "ఇల్లు విడిచి పన్నెండు రోజులైంది. అస్వస్థతగానున్న నా భార్య చిన్నపిల్లలతో ఇంట్లో ఒంటరిగా వుంది. ఆమె కొరకు త్వరగా చేరాలి" అని చెప్పాను. "బ్రదర్, మేమంతా ప్రార్థిస్తాము. మీ సతీమణిగారు క్షేమంగా వుంటారు. ఆమెకు ఏ కీడు సంభవించకుండా ప్రభువు చూస్తాడు. మీరు ప్రభువు పనిలో వుండాలని మేము ఆశిస్తు న్నాము" అని అన్నారు. "మీరు చెప్పవలసింది వివరంగా చెప్పండి" అని అన్నాను. వారు "రేపు మాతో కలసి మీరు హైదరాబాద్ వచ్చి మా ఇంట్లో పది రోజులు వుండండి. మేమొక మీటింగు ఏర్పాటు చేస్తాము. ఆ మీటింగులో రెవ. ఫిలిప్స్ అబ్రాహాంగారు, ఆరార్కేమూర్తిగారు, దేవప్రకాశంగారు మరియు మీరు కలసి ప్రసంగించెదరు" అని నాతో చెప్పగా ఇది ప్రభువు చిత్తమని ప్రభువు తెరచిన మార్గమని గ్రహించి "సరే" అన్నాను.

వారితో కలసి హైదరాబాదు చేరుకున్నాను. పదకొండు రోజులు వారింట్లో వున్నప్పుడు వారు హైదరాబాద్, సికింద్రాబాద్ ఏరియాలలోవున్న ప్రఖ్యాతిగాంచిన దైవజనులందరితో పరిచయం చేయించిరి. కొన్ని సంఘాలలో సాక్ష్యము, వాక్యము చెప్పుటకు ప్రభువు మార్గము తెరిచారు. 1985 జూన్‌లో హైదరాబాద్ విజయనగర్ కాలనీలో మూడు రోజుల సభలు జరిపించారు. రెండోరోజు రాత్రి నా సాక్ష్యములో కొంతభాగాన్ని చెప్పాను. చాలామంది దైవాత్మ ద్వారా కదలించబడ్డారు. అందులో ఒకాయన ఎవరో పండిత్ అని తనకు తానే నాతో పరిచయం చేసుకొని "అయ్యా, పరవస్తుగారు! తమరు ప్రఖ్యాతిగాంచిన వంశమునకు చెందినవారైయుండి హైందవ ధర్మశాస్త్రాన్ని ఖండించి మాట్లా డుచూ క్రైస్తవ్యమును ప్రచారము చేయుట మంచిది కాదు" అని అంటుండగా మధ్యలోనే నేను "అయ్యా, పండిత్‌గారూ! నేను చెప్పిన దానిలో ఏదైన అసత్యముంటే చెప్పండి" అని అడిగాను. అందుకతడు "సత్యమేగాని..." అంటుండగా వెంటనే నేను "సత్యాన్నే నేను ప్రకటించాను గదా? గనుక

నీకు యిష్టముంటే దాన్ని స్వీకరించండి. లేదా విడిచిపెట్టండి నాతో వాదిస్తే మీకేమి లభిస్తుంది? వాదించే వారికి దేవుడు కనబడడు. తర్కించే వాడు దేవుని స్వరము వినలేరు. గనుక నాకది కూడదు" అని అంటుండగా అనేకమంది ప్రజలు నా చుట్టూ మూగి కొంతమంది నాతో కరచాలనము చేస్తూ నన్నభినందించారు. మరికొంతమంది కొన్ని బహుమతులిచ్చి ప్రార్థించమని కోరారు. మరికొంతమంది మీటింగ్సు కొరకు ఆహ్వానము చేస్తామని అడ్రసు తీసుకున్నారు. మరికొంత మంది బ్రాహ్మణులు వారి గృహాలకు నన్ను ఆహ్వానించారు. పిమ్మట ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఒక బ్రాహ్మణ సహోదరుడు తన గృహములో ఒక దినము గడపమని కోరగా పన్నెండు నుండి తెనాలిలో మీటింగ్సున్నాయి గనుక నన్ను తీసుకొని వెళ్ళటానికి ఒక దైవజనుడు నా కొరకు వేచియున్నాడు. "రేపు రాత్రి నేను తెనాలి వెళ్ళాలి గనుక ఈ సారి క్షమించండి. ప్రభువు చిత్తమైతే ఇంకొకసారి ఒకరోజు కాదు మూడు రోజులుంటాను మీ యింట్లో" అని వానికి నచ్చజెప్పాను. ఆ రాత్రి దైవజనులు దేవప్రకాశంగారింట్లో నేను ఆరార్కేమూర్తి గారు కలసి వారిచ్చిన ఆతిథ్యము పుచ్చుకొని ఆఖరుసభలో ప్రసంగించుటకు బయలుదేరాము. ఆ సభానంతరం అందరి యొద్ద వీడ్కోలు తీసుకొని తెనాలి సభలకు వెళ్ళిపోయాను. నేను వీడ్కోలు తీసుకొనుచుండగా అనేకులు దైవజనులు, విశ్వాసులు "బ్రదర్, మీరు హైదరాబాదు రావాలని, మీ పరిచర్య ఇక్కడ కొనసాగాలని, ప్రభువు మిమ్మును పంపించాలని మీ రాక కొరకు ఎదురుచూస్తు ప్రార్థిస్తుంచాము. ఇప్పటికే అనేకమంది సంఘస్తులు మీరు ఈ ప్రాంతానికి దేవునిచేత పంపబడాలని ఉపవాస ప్రార్థనలు మొదలుపెట్టారు. మీరు తప్పకుండ ప్రభువుచేత పంపబడుతారని మా నమ్మకం" అని ప్రోత్సహించారు. నా మనస్సులోనే దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుకున్నాను. ఇప్పుడు నాకు చాల ధైర్యము కలిగినది. మనదేశంలో ప్రఖ్యాతిగాంచిన దైవజనులతో వాడబడుటకిది మొదటిసారి. దేవుని నోటినుండి వచ్చిన మాట ఇచ్చట నెరవేరినదని జ్ఞాపకము తెచ్చుకొని మదిలో దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకున్నాను. మరుసటి రోజు తెనాలి చేరుకున్నాను. అక్కడ మూడు రోజులుండి వేమూరు నుండి ఆహ్వానము పొంది అక్కడ మూడురోజులు సభలో మాట్లాడి ఒరిస్సా రాష్ట్రమునకు ప్రయాణమయ్యాను.

"ప్రభువా! నేను హైదరాబాద్ వెళ్ళి ఏమి చెయ్యగలను?" అని నేను ప్రభువుని అడిగిన ప్రశ్నకు సమాధానం ప్రభువు నాకీవిధంగా చేసి చూపించాడు. "నీవేమి నా కొరకు చేయలేవుగాని నేను సమస్తము నా కొరకు నీ చేత చేయించుకో గలనన్న విషయం రుజువైంది. ఇక హైదరాబాద్ రావడానికి నాకు ఏ ఆటంకం లేదు. భయము, సంశయం ఏ మాత్రమును లేదు. నేను హైదరాబాద్ ప్రయాణం చేయుటకు సమయం కొరకు వేచియున్నాను. 1985 డిసెంబరులో హైదరాబాద్ నుండి దైవప్రియులు 'బ్రదర్ కుటుంబంతో వెంటనే రండి' అని టెలిగ్రాం పంపించారు. బయలుదేరటానికి ఆర్థిక ఇబ్బంది ఎదురైంది. మూడు రోజులు ప్రార్థించాము. మూడవ రోజు సాయంత్రం పోస్ట్‌మాన్ 400 రూపాయలు టి.యం.ఓ. తెచ్చి ఇచ్చాడు.

అదేరోజు సాయంత్రం ఆరున్నరకి మేము సామాను సర్దుకొని తలుపు దగ్గరకు వచ్చి నేను, నా భార్య, కుమారులు కళ్లు మూసుకొని "ప్రభువా, అబ్రాహాము తనకు తెలియని దేశమునకు నీ చిత్తానుసారముగా విశ్వాసముతో ప్రయాణ మాయెను. అబ్రాహాము మాదిరిగ నేను కూడ నాకు తెలియని దేశమునకు విశ్వాసముతో నీ మాట చొప్పున ప్రయాణమై వెళ్ళుచున్నాను. నాకు ముందు నీవు వెళ్ళవలసినదిగా ప్రార్థించు చున్నాను. నా మార్గము నీవు సరాళము చేసినట్లు నమ్ము చున్నాను. అబ్రాహాము తన సంతానమును కనానులో స్థిర పరచినట్లు నన్ను కూడ హైదరాబాదులో స్థిరపరచి నాకును నా సంతానమును విస్తరింపజేయుము" అని ప్రార్థించి నా పరివారము దగ్గర సెలవు తీసుకొని కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణమయ్యాము. మరుసటి రోజు సాయంత్రం మూడు గంటలకు చేరాల్సిన బండి ఆలస్యంగా తొమ్మిదిన్నర గంటలకు చేరింది.

సుమారు ఒక వారంరోజులు ఒక సహోదరుడి ఇంట్లో వున్న తర్వాత అనేకమంది విశ్వాసులు, దైవసేవకులును సేవకురాండ్రును ఆలోచించి నన్ను సికిందరాబాదులోనున్న మల్కాజ్‌గిరి ప్రాంతంలో హనుమాన్‌పేటయందు ఒక సహోదరి మా కొరకు ఇంటి అద్దెకట్టగా వారు చూపిన ఆ ఇంట్లో అనేకమంది భక్తులు, విశ్వాసులు, దైవ సేవకురాండ్రు వచ్చి ప్రార్థించగా నేను ఆ ఇంట్లో చేరాను. ఒక నెల రోజుల తర్వాత వేరొక పెద్ద ఇంటికి సమీపంలోనే ఇల్లు మారాను.

ధారావాహిక

# నిత్యజీవజలము

2

ఐగుప్తు దేశంలో క్రీ॥పూ॥ 331లో అలగ్జాండ్రియా అనే పట్టణం అలగ్జాండరు ద్వారా స్థాపించబడింది. అంతకు పూర్వమే అనేకమంది యూదులు ఈ ప్రాంతమునకు వలసవచ్చి స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరికి గ్రీకు భాష తప్ప వారి పితరుల భాష హెబ్రీ భాష తెలియదు. వీరికి అందుబాటులో ఉండుటకు క్రీ॥శ॥ 200లో పాత నిబంధన గ్రీకు భాషలోనికి తర్జుమా చేయుటకు ప్రారంభించి మొదటి దిగా మొదటి ఐదు కాండములను ముగించిరి. ఈ తర్జుమాను డెబ్బై మంది ఇశ్రాయేలీయుల పెద్దలను అలగ్జాండ్రియా రప్పించి వారిచే ఈ ఐదు కాండములను తర్జుమా చేయించిరి. ఈ గ్రీకు పాత నిబంధనను సెప్టూజియంట్ అంటారు. ఇప్పటికి ఈ గ్రీకు పాతనిబంధన గ్రీకు సంఘాలలో విరివిగా వాడ బడుచున్నది. ఆదిమ సంఘము ద్వారా అంగీకరింపబడిన నూతన నిబంధన తర్వాత ఈ సెప్టూజియంట్ (గ్రీకు పాతనిబంధన)తో చేర్చబడి పూర్తి బైబిల్‌గా అక్కడ వాడు కొనుచున్నారు. ఇంకొక ముఖ్య విషయమేమిటంటే ఇప్పటికి ఇతర భాషలలోనికి బైబిల్‌ను తర్జుమా చేయు సమయంలో ఈ గ్రీకు బైబిల్‌ను కూడా రెఫర్ చేస్తున్నారు. తూర్పు ఉత్తర దిక్కులకు మధ్యలోనున్న అనగా ఉత్తర మెసపటోమియా ప్రాంతములో వున్న హెర్బ్రజీ జాతి వారికి కూడా వారి భాష రాదు. వీరికి అందుబాటులో వుండుటకు మొదటిగా పాత నిబంధనను సిరియా భాషలోకి అనువదించారు. తరువాత కొత్త నిబంధనను కూడా అనువదించారు. తరువాత కొత్త నిబంధనను కూడా అనువదించారు.

క్రైస్తవ్యం ఏ విధంగా ఐగుప్తులోనికి ప్రవేశించిందో తెలియక పోయినా యేసయ్య, పన్నెండుమంది శిష్యుల కాలంలోనే ఐగుప్తులో చాలామంది క్రైస్తవులు ఆది సంఘ కాలంలోనే వున్నారు. వీరికి అందుబాటులో ఉండుటకు కోప్టిక్ భాషలోకి బైబిల్‌ను అనువదించారు. కోప్టిక్ ఐగుప్తీయుల భాష.

క్రీ॥శ॥ 4వ శతాబ్దిలో బిషప్ ఉల్ఫిలాస్ బైబిల్‌ను గోతిక్ భాషలోకి అనువదించాడు. ఈ గోతిక్ భాష ఇంగ్లీషు, జర్మనీ, డచ్, స్కాండనేవియా భాషలకు మూలభాష. క్రీ॥శ॥ 2వ శతాబ్దంలో గ్రీకుల ఆధిపత్యం అంతరించి రోమనుల ఆధిక్యత ప్రబలుచున్న కాలంలో లాటిన్ భాష సంస్కృతి విస్తరించింది. ఈ కాలంలో లాటిన్ బైబిల్ అవసరమని గుర్తించిన రోము బిషప్ దమస్కస్ (క్రీ॥శ॥ 366–384) తన సెక్రెటరీ అయిన జెరోముకు ఈ అనువాద పని అప్పగించాడు. మొదట సువార్తలతో ప్రారంభించి, కీర్తనలు ఆ తదుపరి క్రొత్త నిబంధన లోని అన్ని పుస్తకములను లాటిన్ భాషలోనికి అనువదించాడు. ఈ లోపు తాను హెబ్రీ భాషను క్షుణ్ణంగా నేర్చుకొని క్రీ॥శ॥ 405 నాటికి పూర్తి బైబిలును భాషాంతరము చేశాడు. ఈ లాటిన్ బైబిల్‌ను 'వల్గేట్' అన్నారు. మొదట్లో ఈ బైబిల్ అంతగా ఆదరణ పొందక పోయినా తరువాత ఇది రోము అధికారము క్రింద వున్న ప్రపంచమంతా విరివిగా వాడబడినది. పశ్చిమ ఐరోపాలోని దేశములలో సువార్త ప్రకటించుటకు ఉపయోగిం చబడిన బైబిల్ ఇదే. ఇప్పటికి రోమన్ కాథలిక్ సంఘము వారు ఈ వల్గేట్‌ను ఆధారము చేసుకొని భాషాంతరము చేయబడిన బైబిల్‌నే గుర్తించుచున్నారు. చేతితో ఎత్తి వ్రాయబడిన లాటిన్ వల్గేట్ లారెన్‌టియన్ లైబ్రరి ఆఫ్ ఫ్లొరెన్స్, ఇటలీలో భద్రపరచబడి వుంది.

16వ శతాబ్దము ఆరంభము వరకు పశ్చిమ ఐరోపాలోని ప్రజలకు అందుబాటులో ఉండుటకు బైబిల్‌ను వారి వారి భాషలలోకి అనువదించారు. ఈ అనువాదాలన్ని లాటిన్ వల్గేటును ఆధారం చేసికొని చేసినవి. అయితే కీర్తనలు, సువార్తలు, పది ఆజ్ఞలు, ముఖ్యమైన కథలు, రక్షణ సువార్త ఇలా కొన్ని భాగాలు మాత్రమే అనువదించారు. వీటన్నిటికన్నా జాన్ విక్లిఫ్‌చే లాటిన్ వల్గేట్ నుండి 1330–1384లో తర్జుమా చేయబడిన ఇంగ్లీషు బైబిల్ మిన్నగా చెప్పబడినది. జాన్ విక్లిఫ్ మంచి మేధావియే కాక, మంచి బోధకుడు మరియు సంఘ సంస్కర్త కూడా. విక్లిఫ్ చనిపోయిన తర్వాత తన సెక్రటరీ అయిన జాన్ పర్వే (క్రీ॥శ॥ 1395) అదే ఇంగ్లీషు బైబిలును మరికొంత విపులంగా అనువదించాడు.

1456 సం॥లో మొట్టమొదటిగా లాటిన్ బైబిల్ (గూటెన్ బర్గ్ ఎడిషన్) అచ్చు వేయబడింది. తర్వాత పది సంవత్సరాలలో హెబ్రీ బైబిల్, గ్రీకు క్రొత్త నిబంధన మరియు సెప్టూజియంట్ అచ్చు కాబడినవి. ఆ తర్వాత 1522లో మార్టిన్ లూథర్

జర్మనులకు అవసరమని కొత్త నిబంధనను, తర్వాత పాత నిబంధనను అనువదించాడు. విలియం టిండేల్ తన సమయ మును, దేవుడు తనకిచ్చిన తలాంతులను తన ప్రజలైన ఇంగ్లాండు వారికై వెచ్చించి అందరికి అర్ధమగు ఇంగ్లీషు భాషలోకి మొదట కొత్త నిబంధనను గ్రీకు బైబిలు నుండి తర్జుమా చేసి ముద్రించినాడు. ఈ ముద్రణకు పీటర్ స్కాఫర్ ఎంతో సహకరించి దాదాపు 6000 కాపీలు ముద్రించాడు. టిండేల్ పాత నిబంధనలోని ఐదు కాండములను, యోనాలను కూడా ఇంగ్లీషులోకి అనువదించి ముద్రించాడు. యెహోషువా నుండి 2దిన వృత్తాంతముల గ్రంథములను కూడా అనువ దించారు. కాని తన మరణమునకు ముందు ముద్రించ లేకపోయాడు.

టిండేల్ తప్పుడు బోధలు చేయుచున్నాడని అప్పటి సంఘం 17 నెలలు కారాగారములో వుంచి ఆ తర్వాత 1536 సం॥ అక్టోబర్ 6వ తేదిన గొంతు నులిమి చంపి అతని శరీరమును మంటతో కాల్చివేసిరి. తన మరణమును ముందే తన స్నేహితుడైన మైల్స్ కవర్‌డేల్ పూర్తి ఇంగ్లీషు బైబిల్‌ను అచ్చు వేయించెను. అటు తరువాత థామస్ మాథ్యూ అను టిండేల్స్ స్నేహితుడు ఇదే టిండేల్ వర్షన్‌కు కొన్ని మార్పులు చేసి తిరిగి అచ్చు వేయించాడు (1535). ఇదే రోజుల్లో హెన్రీ రాజు చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌లోని ప్రతి పారిష్‌లోను ఒక పూర్తి ఇంగ్లీషు బైబిల్ వుండవలెనని ఆజ్ఞ ఇవ్వగా థామస్ మాథ్యూచే రివైజ్ చేయబడిన టిండేల్ బైబిల్ ఆథరైజ్‌డ్ వర్షన్‌గా ధృవీకరింపబడి ప్రతి పారిష్‌లోను వెలిసినది (1539). దీనినే గ్రేట్ బైబిల్‌గా అభివర్ణించారు.

జెనీవా, స్విర్జర్లాండు, స్కాట్లాండు ప్రాంతములకు తరలి వెళ్లిన ఇంగ్లీషు వారి కొరకు ప్రింటు చేయబడిన బైబిల్‌ను జెనీవా బైబిల్ (1560) అన్నారు. 1568లో మరియొక బైబిల్ ప్రింటు చేయబడినది. దీనిని బిషప్స్ బైబిల్ అన్నారు. ఎందుకంటే దీనిని ఆది భాషలైన హెబ్రీ, గ్రీకుల నుండి అనువాదము చేసిన వారిలో కొందరు బిషప్పులు, మిగిలిన వారు తరువాత బిషప్పులైనారు.

ఈ విధంగా టిండేల్, కవర్‌డేల్, గ్రేట్ బైబిల్, జెనీవా బైబిల్ మరియు బిషప్స్ బైబిల్ అనునవి కింగ్ జేమ్స్ వర్షన్ ఆవిర్భవించుటకు కారణమైనవి. 1603లో నాల్గవ కింగ్ జేమ్స్ స్కాట్లాండు సింహాసనము అధిరోహించిన తర్వాత సంఘములో అన్ని సమస్యలను చర్చించి, రూపుమాపుటకు ఒక కూడికను ఏర్పాటు చేశాడు. ఆ కూటమిలో క్రొత్త బైబిల్ భాషాంతరము నకై అవసరత ఏర్పడినట్లు గమనించారు. దీని ఫలితంగా 47 మంది పండితులలో ఆరు గ్రూపులుగా విడిపోయి మూడు గ్రూపులు పాత నిబంధనను, రెండు గ్రూపులు క్రొత్త నిబంధ నను, ఒక గ్రూపు అపొక్రిఫా (ఈ పుస్తకము ఇప్పుడు ప్రొటె స్టంట్ బైబిల్‌లో లేవు) మీదను పని చేసినవి. ఫలితంగా క్రీ॥శ॥ 1611లో కింగ్ జేమ్స్ వర్షన్‌గా మరియొక బైబిల్ ప్రింటు చేయబడినది.

అదే కింగ్ జేమ్స్ వర్షన్‌ను అర్థం చేసుకొనుటను మరి కొంత సులభతరం చేస్తూ 130 మంది పండితుల సహా యంతో అందుబాటులో వున్న హెబ్రీ, గ్రీకు భాషల బైబిల్‌ను, కింగ్ జేమ్స్ వర్షన్‌ను దగ్గర వుంచుకొని 1982 నాటికి 'న్యూ కింగ్ జేమ్స్ వర్షన్'గా భాషాంతరము చేసిరి. ప్రపంచములోని ఆంగ్లభాష మాట్లాడు ప్రజల కొరకు అతి సామాన్యమైన మానవులకు అందుబాటులో వుండుటకు ఇలాంటివి మరెన్నో భాషాంతరం చేయబడి ముద్రించబడినవి. రివైజ్డ్ స్టాండర్డ్ వర్షన్, న్యూ ఇంగ్లీష్ బైబిల్, యాంప్లిఫైడ్ బైబిల్, ది లివింగ్ బైబిల్, ది గుడ్‌న్యూస్ బైబిల్, న్యూ అమెరికన్ స్టాండర్డ్ వర్షన్, న్యూ ఇంటర్నేషనల్ వర్షన్‌లాంటివి క్రైస్తవులు విరివిగా వాడుచున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో వుంది. అయితే మనదేశంలో దాదాపు 18 భాషలు భారత ప్రభుత్వముచే గుర్తింపు కలిగినాయి. దాదాపు 1600లకు పైగా భాషలు మనదేశంలో వున్నాయి.

తెలుగు బైబిలు చరిత్ర అను చిన్న పుస్తకంలో (బైబిల్ సొసైటీ వారిచే ముద్రించబడినది) పరిశుద్ధ గ్రంథమును తెలుగులోకి అనువదించుట 1712లో మొదలైనది. జిగిన్‌బాగ్ అను మిషనరీ దక్షిణ భారతదేశం వచ్చి క్రొత్త నిబంధన గ్రంథమును తర్జుమా చేయటం ప్రారంభించాడు. ఆ తర్వాత వచ్చిన ఘలి అను మిషనరీ 1719లో ప్రారంభిం చాడు. ఇతను చాలా భాషలు నేర్చిన పండితుడు. ప్రభువు ప్రార్ధనను ఇతను ఎనిమిది భాషలలోనికి తర్జుమా చేసి తాటాకు పత్రముల మీద వ్రాసి పంచిపెట్టెను. ఈయన బైబిల్‌ను తెలుగు భాషలోనే కాక హిందీ, తమిళ భాషల లోనికి అనువదించుటకు పూనుకున్నారు. ఈ విధంగా తర్జుమా చేసిన పాత నిబంధన వ్రాత ప్రతులను జర్మనీలోని తన యూనివర్సిటీ లైబ్రరీకి పంపించాడు.

# శాశ్వత రక్షణ

## (రక్షణ యొక్క శాశ్వత భద్రత)

ఇంకా యేసు ఏమని చెప్తున్నాడంటే తన ఆధీనంలో ఉన్నవారిని ఎవరూ అపహరింపలేరు అనియు, తండ్రి అందరికంటే గొప్పవాడు. ఆయనే మనలను క్రీస్తులో ఉంచిన వాడు కనుక తండ్రి చేతిలో నుండి ఆయన ప్రజలను ఎవరూ అపహరింపలేరు. ప్రియ విశ్వాసులారా! దీనంతటిని బట్టి ఆలోచిస్తే మనము ఎంతో గొప్ప రక్షణలో భద్రపరచబడి వున్నాము. సాతానుడుగాని, మానవుడుగాని, ఏ శక్తియు మనలను దొంగిలింపలేదు. కనుక సంతోషించుడి, ఉత్సాహంతో గంతులు వేయుడి. హల్లెలూయ!

రోమా 8:28-39 నిజమైన విశ్వాసులందరూ దేవుని నిత్య సంకల్పమును నెరవేర్చుటకు పిలువబడ్డారు (28వ). ఎఫెసీ. 1:9-11 మనము అనాదికాలము నుండి అనగా యుగముల నిర్మాణమునకు ముందే పిలువబడితిమి. పిలిచిన వాడు నిత్యుడగు దేవుడు. ఆయన వలనను, ఆయన ద్వారాను, ఆయన కొరకును సమస్తము కలిగి వున్నవి (రోమా 11:36). ఆ కుమారుని సహవాసంలోనికి తండ్రి ద్వారా పిలువబడ్డాము (1కొరింథీ. 1:9). దీని వలన మనకు ఏమి తెలియబడు తుందంటే

1. సమస్తమైన వాటికి ఉనికి దేవుడే.
2. ఆయన తన ఆలోచన చొప్పున సమస్తమును తన శాశ్వత ప్రణాళిక లోనికి వచ్చేటట్లు చేస్తాడు.
3. చివరికి సమస్తమును ఆయన మహిమార్థంగా పూర్తి చేయబడి నిత్యమైన మహిమలో ఆయనకు ఆనందాన్ని కలుగజేస్తాయి. కాబట్టి ఆయన సంకల్పము నెరవేరకుండా ఆపగల శక్తి ఎవరికీ లేదని మనకు గట్టిగా అర్థమవుతుంది. ఆయన సంకల్పం చొప్పున పిలువబడిన విశ్వాసులకు మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవి (రోమా 8:28). జగత్ పునాది వేయబడక మునుపే దేవుడు మనలను ఎరిగి వున్నాడు. దేవుని యొక్క భవిష్య జ్ఞానములో ప్రభువైన యేసు కార్చిన రక్తమువల్లనూ, ఆత్మ శుద్ధీకరణ వల్లనూ దేవుడు మనలను ఏర్పాటు చేసుకొనియున్నాడు. దేవుడు ముందుగా ఎరిగిన నిజమైన విశ్వాసులను క్రీస్తు స్వరూపంలోనికి ముందు గానే నిర్ధారణ చేశాడు (ఎఫెసీ. 1:5). ఇది సంపూర్ణ కుమారత్వము.

దేవుని సంకల్పము చొప్పున ఆదిలోనే ఎరిగి కుమారుని సారూప్యమునకు నిర్ధారణ చేయబడి ఎన్నుకొనబడిన వారు ఎన్నటికైనా తప్పిపోగలరా? అలా చెప్పినట్లయితే మహా దేవుని యొక్క శక్తిని ఆయన సంకల్పమును తిరస్కరిస్తున్నారన్న మాట. ఇంకొక విధంగా చెప్తే ఆయనను అవమానపరుస్తున్నారన్న మాట. రోమా 8:29,30లో మనము అయిదు సంగతులు గమనిస్తాము.

1. ముందుగానే ఎరుగుట
2. ముందుగానే నిర్ణయించబడుట
3. పిలువబడుట
4. నీతిమంతులుగా తీర్చబడుట
5. మహిమపరచబడుట

ఈ అయిదు మాటలు మూలభాషలో క్రియా పదాలు. వీటికి మూలభాషలో 'కాల నిర్ణయము కాని క్రియా పదాలు' అని పిలుస్తారు. అంటే దేవుని నిత్య సంకల్పము చొప్పున ఆయన బిడ్డలమైన మనలను సంపూర్ణలుగా ఆయన సృష్టించాడని ఈ అయిదు క్రియా పదాలు వివరిస్తున్నాయి. వీటికి కాల పరిమితి లేదు గదా అని మీరనవచ్చు. అయితే సర్వశక్తిమంతుడై అన్ని కాలములను ఎరిగిన మన దేవునికి సంబంధించినంత వరకు పైన చెప్పబడిన అయిదు ముందు గానే ఎరిగి, ముందుగానే నిర్ణయించబడి, పిలువబడి, నీతిమం తులుగా తీర్చబడి, మహిమపరచబడి అనే అయిదు క్రియలను నెరవేర్చి పూర్తి చేశాడు.

దేవుడు ప్రేమతో మనలను ఎవరిలో వుంచాడో ఆ క్రీస్తులోనే సమస్తమును జరుగుతుంది (1కొరింథీ. 1:30,31). నిజ విశ్వాసులమైన మనము ముందుగానే ఎరిగి పిలువబడి, నీతిమంతులుగా తీర్చబడి, ముందుగానే నిర్ణయించబడి క్రీస్తు స్వరూపం పొందుటకు శాశ్వతముగా మహిమపరచబడిన వారము. దేవుడు సంకల్పించి పూర్తి చేసిన ఈ స్థితిలోనికి ఇప్పుడు జీవించుచున్న మనము ఎదుగుచూ రూపాంతరము పొందే కార్యక్రమంలో వున్నాము. దేవుడు ఓడిపోవుట అసంభవము కనుక నిజముగా రక్షింపబడిన వ్యక్తి తప్పిపోయి అగ్నిగుండములో పడి నశించిపోవుట అసంభవము. అలా

చెప్పని వారందరూ దేవుని మాటలను, కార్యములను ఎగతాళి చేయుచున్నారన్న మాట, దేవుని అవమానపరచు చున్నారన్న మాట.

కనుక ప్రియులారా! ఆ ధన్యత కొరకు ఆత్మీయమైన జ్ఞానము, ప్రత్యక్షతల కొరకు ప్రభువునందు ధ్యానించండి. దేవుడు మన పక్షమున వుండగా మనకు విరోధి ఎవరు? మన శత్రువులే ఆయన శత్రువులు. అంటే మనలను ఎవరూ జయించలేరు. ఒకవేళ దీని మీద ఎవరైనా వాదనకు దిగితే ఓడిపోయి వెనుకకు తిరగాల్సిందే. అన్ని బహుమానములకు మించిన బహుమానముగా తన ఏకైక కుమారుని శరీరధారిగా మన కొరకు పంపుటకు వెనుదీయని దేవుడు ఆయనతో పాటు సమస్తమును మనకు అనుగ్రహించును. ఆ సమస్తము క్రీస్తుతో సమానమైనది కాదుగాని క్రీస్తులోనే గుప్తమైయున్నవి (రోమా 8:31, కొలస్సి. 2:3,11). ఆ తరువాత వచనాలు రోమా 8:32-34 నేరము నుండి, శిక్ష నుండి విడుదల గురించి చెప్తున్నాయి. ఏ న్యాయస్థానము ముందు మనము నీతి మంతులుగా తీర్చబడ్డామో దానికి దేవుడే న్యాయాధిపతి. ఎవరైనా దేవుడు ఏర్పరచుకొనిన వారి మీద నేరము మోపితే వారిని నీతిమంతులుగా తీర్చిన న్యాయాధిపతియైన దేవుని ఎదుర్కోవాలి. మానవులుగాని, సహోదరుల మీద నేరము మోపే సాతానుడుగాని ఆ పని చేయలేడు. మన పాపముల నిమిత్తము, సర్వసృష్టి పాప పరిహారము నిమిత్తము దేవాది దేవుడు కోరే షరతులన్నింటిని ఆయనకు సంతృప్తి కలిగించే విధంగా ప్రభువైన యేసు నెరవేర్చి తగిన శిక్ష తన శరీరమందు అనుభవించాడు (రోమా 8:3,4). ఇప్పుడు యేసుక్రీస్తు మన కొరకు ఉత్తరవాదిగా, మన ప్రతినిధిగా దేవుని న్యాయస్థానంలో నిలిచియున్నాడు (1యోహా. 2:1-3). కాబట్టి దేవుడు ఏర్పరచుకొని, నీతిమంతులుగా తీర్చిన వారిపై నేరాలు మోపినవారు ఓడిపోవలసిందే. ఆఖరిగా మృత్యుంజయుడై లేచిన మహిమగల మన ప్రభువు ఇప్పుడు దేవుని కుడిపార్శ్వమున వుండి మన కొరకు ఎడతెగక విజ్ఞాపన చేయుచున్నాడు (రోమా 8:34).

ఈ విధంగా క్రీస్తు దేవుని కుడిపార్శ్వమందు నిలువబడి మన సంపూర్ణ రక్షణ కార్యక్రమమును నిర్వహిస్తున్నాడు (హెబ్రీ. 7:25). ఈ రక్షణ కార్యక్రమము మన ఆత్మ తిరిగి జన్మించటంతో ప్రారంభమై జీవాత్మ (జీవుడు) రూపాంతరము చెంది, శరీరము మహిమ శరీరముగా పునరుత్థానమగుటతో పూర్తవుతుంది. యోహాను 17లో క్రీస్తుయేసు తండ్రికి చేసిన విజ్ఞాపన ఏమిటంటే, మనము సాతాను నుండి రక్షింపబడి, సత్యముచేత పవిత్రపరచబడి, తాను ఎక్కడ ఉండునో మనమును అక్కడ ఉండాలని తండ్రిని కోరుకున్నాడు. రోమా 8 చివరి వచనాలలో ఏర్పరచుకొనబడిన వారిని పిలువబడిన విశ్వాసులను, యేసు ప్రేమ నుండి ఏ పరిస్థితులుగాని సృష్టించబడిన ఏదీ కూడా వేరు చెయ్యలేదని పౌలు విజయోత్సాహముతో వివరించాడు. ఆయన ప్రేమ మన యందు సంపూర్ణమగుచుండగా మనము పరిపక్వమగు చున్నాము (1యోహా. 4:12). యేసు ప్రేమ నుండి మనలను ఎవరూ వేరు చేయలేరు అనునది సత్యము (యోహా. 13:1; 15:9). మన క్రైస్తవ జీవితంలో ఏమి సంభవిస్తున్నప్పటికీ దానితో ఏమి సంబంధం లేకుండానే మనము ఆయన ప్రేమలో నిలిచియుండవచ్చు. రోమా 8:35,38,39లో చెప్పబడిన ప్రకారం శ్రమకాని, బాధకాని, హింసలుకాని, కరువు, వస్త్రహీనత, ఉపద్రవము, ఆఖరికి మరణమైనను క్రీస్తు ప్రేమ నుండి మనలను వేరు చేయలేవు. ఈ శ్రమలన్నీ ఆది నుంచి దేవుని ప్రజలకు జరుగుతూనే వున్నాయి. అయినా అవి మనలను జయింపలేవు. మనలను క్రీస్తు ప్రేమ నుండి వేరు చేయనూ లేవు. మనలను ప్రేమించుచున్న వాని శక్తిని బట్టి మనము మహా విజయులము. దేవునికి స్తోత్రము! హల్లెలూయ. ఎన్నో శతాబ్దాలుగా విశ్వాసులు, దేవుని ప్రేమించిన వారు, క్రీస్తు కొరకు హింసను భరించి హత సాక్షులైపోయారు. 'మరణము' (ఖడ్గము) వారిని క్రీస్తు ప్రేమ నుండి వేరుచేయలేక పోయింది. అంటే మరణమే ఓడి పోయిందన్నమాట. ఇప్పటి కాలంలో కూడా ప్రపంచంలో క్రీస్తు కొరకు హతసాక్షులుగా మరణిస్తున్న వారు సంవత్సరానికి సుమారు లక్షాయాభైవేలమంది. వారందరూ కార్చిన రక్తము ద్వారా వెలువడుతున్న విజయ ధ్వని కేకలు 'మమ్ములను ప్రేమించెడి వాని ద్వారా మేము జయించిన వారము' అనే విజయనాదము కేకలు పైకి వెళ్తున్నాయి. క్రీస్తునందు విశ్వసించుట మాత్రమేగాక ఆయన పక్షంగా శ్రమపడు టయు ఆయన పక్షంగా మనకు అనుగ్రహింపబడినది. పౌలు కూడ ఆయన పొందిన శ్రమలలో మహిమపరచ బడ్డాడు (రోమా 5:3; 2కొరింథీ. 12:9)

# మహా యజ్ఞమ్



పరమ తండ్రియైన దైవం తన కుమారుడు మానవుడైన క్రీస్తు యేసును 'ఓ దేవా' అని సంబోధిస్తున్నాడు. క్రీస్తే భూమి పునాదులను వేశాడని ఆకాశాలను సృజించాడని, తండ్రియైన దేవుడు వెల్లడిస్తున్నాడు.

పురుష ద్వారా అన్నియు కలిగినవి. తన యజ్ఞం ద్వారా సమస్తమును ఆయనే కలిగించాడు. వైభవోపేతమైన ఆయన మూర్తిమత్వంలోని, చతుర్భాగం నుండి తన ప్రాణం ఊది సమస్త జీవరాసుల్ని వెలియించాడు. ఋగ్వేదం, పురుష సూక్త నుండి, ఎంత గంభీరమైన సత్యాన్ని కనుగొన్నామో గమనించండి.

ప్రజాపతి యొక్క పరిత్యాగం గురించి, మరికొంత ప్రశస్తమైన సమాచారం తెలుసుకుందాం.

## 'యజ్ఞ సమయం'

పురుష యొక్క బల్యర్పణ ఏ సమయంలో సంభవమైంది? పురుష సూక్త ఆధారంగా చూస్తే భూమి సృజనమైన సమయం నుండి అని, స్పష్టంగా తెలుస్తుంది. బైబిల్ గ్రంథ సాక్ష్యం మేరకు జగదుత్పత్తి మొదలుకొని వధింపబడి వున్న గొఱ్ఱెపిల్ల (యేసుక్రీస్తు - ప్రకటన 13:8) అని తెలుస్తుంది.

## యేసుక్రీస్తు పూర్వ ఉనికి

రమారమి, యేసుక్రీస్తు రెండవేల యేండ్ల క్రితం బేత్లెహేము అను ఊరిలో జన్మించాడు. అయితే ఆయన ఆరంభ ఉనికిని గురించి బైబిల్ గ్రంథంలో పాత, క్రొత్త నిబంధనల్లో ఎన్నో వచనాలున్నాయి. మీకా ప్రవక్త, యేసు పుట్టుక స్థలాన్ని గూర్చి ముందుగా ప్రవచించాడు. క్రీ॥పూ॥ 750లో యేసు యొక్క ఆరంభ ఉనికిని గూర్చి కూడా తెలిపాడు. "బేత్లెహేము ఎఫ్రాతా, యూదా వారి కుటుంబాల మధ్య నీవు చిన్న గ్రామం, అయినా నా కోసం ఇశ్రాయేలు ప్రజలను పాలించ బోయేవాడు నీలో నుండి వస్తాడు. ఆయన పూర్వకాలం నుండి బయలు దేరుతూ వుండేవాడు (మీకా 5:2). ఈ ప్రవచనం ప్రకారం, యూదా జాతి ప్రజలు తమ రాజు మెస్సియ కొరకు ఎదురు చూస్తూ వుండేవారు. ప్రధాన యాజకులు, ధర్మ శాస్త్రోప దేశకులు, ఈ ప్రవచనం గురించి తెలుసుకొని యున్నారు. హేరోదు రాజు యొక్క ప్రవచనాత్మక అంశాన్ని వారు సులభంగా పఠించగలిగిరి. అప్పుడు ఆయన మెస్సియ జన్మస్థలం గురించి వారిని అడిగారు. యూదా జాతి జనాంగానికి దావీదు రాజువలె మరో రాజు రావాలని కనిపెట్టారు (ఎదురు చూశారు). రోమా రాజుల సైనిక పాలన నుండి వారిని విడిపించే మెస్సియ కొరకు నిరీక్షించేవారు. అయితే దావీదు రాజుకు, సమస్త ప్రభువులకు, యుగయుగ ములకు ఏకైక ప్రభువు ఈ మెస్సియ అని వారు ఎరుగరు.

ఒకసారి పరిసయ్యులను యేసు 'అభిషిక్తుని విషయంలో మీ అభిప్రాయం ఏమిటి? ఆయన ఎవరి కుమారుడు? అని ప్రశ్నించాడు. దావీదు కుమారుడు అని వారన్నారు. అలాగైతే దావీదు ఆత్మ మూలముగా ఎందుకు అభిషిక్తుని ప్రభువు అన్నాడు? ప్రభువు నా ప్రభువుతో పలికిన వాక్కు 'నేను నీ శత్రువులను నీ పాదాల క్రింద వుంచే వరకు నా కుడిప్రక్కన కూర్చుని వుండు' అన్నాడు. దావీదు అభిషిక్తుని 'ప్రభువు' అంటే అభిషిక్తుడు దావీదుకు కుమారుడుగా ఎలా వుంటాడు?' అని యేసు వాళ్ళని ప్రశ్నించాడు (మత్తయి 22:41-45).

పరిసయ్యులు జవాబివ్వలేకపోయారు. ఎవ్వరూ ఒక్కమాట కూడ ఆయనకు జవాబు చెప్పలేకపోయారు. అంతేకాక ఆ రోజు నుండి యేసును మరో ప్రశ్న అడగటానికి మరెవ్వరూ తెగించలేదని వ్రాయబడివుంది (మత్తయి 22:46).

యూదా లేఖనాల్లో వాగ్దానం చేయబడిన రాజు, మెస్సియ గురించిన ప్రశ్న యిది. కీర్తనలు 110:1లో 'ప్రభువైన దేవుడు నా ప్రభువుతో పలికిన వాక్కు, నీ శత్రువులను నీ పాదాల క్రింద పీటగా నేను చేసే వరకు, నా కుడిప్రక్కన కూర్చుని వుండు'. ఈ వాక్యాన్ని యేసు వారికి గుర్తు చేస్తున్నాడని, వారికి తెలుసు. ఈ వాక్యాన్ని వినిపించడంలో, వారికెలాంటి, వ్యతిరేకార్థని కనిపించలేదు. నోరు మెదపలేక మూగవోయారు. యూదుల సొంత గ్రంథంలో నుండే, యేసు ఈ వాక్యం వల్లించాడు. సులభమైన, సూటియైన పాత నిబంధన గ్రంథంలోని నీతిని వారికి గుర్తు చేశాడు. మరి ఒక చిన్న పిల్లవాడు సహితం జవాబు ఇవ్వగల ఈ ప్రశ్నకు నేర్పరులైన ఆ మతాచార్యులు ఎందుకు జవాబివ్వలేకపోయారో? వారు పాత నిబంధన గ్రంథ పండితులైనప్పటికీ వారి మెస్సియ అని

వారు నమ్మలేకపోయారు. వారికది ఒక దైవదూషణ అనిపించింది. అందువల్లనే 'అబ్రాహాము పుట్టక మునుపే నేను వున్నాను' అని యేసు పలికినప్పుడు వారాయనను రాళ్ళతో కొట్టడం ప్రారంభించారు (యోహా. 8:58,59).

## పురుష – ఆది సంభవుడు

పురుష సూక్తంలో 'నరుడు' గురించి భావగర్భితమైన వచనాన్ని మనం గమనించాలి. ఆరవ వచనంలో 'పురుషం జాతమగ్రతః' (ప్రథమ భవుడే పురుషుడు) – పురుష సూక్త వాఖ్యాత శయనాచార్య 'పూర్వం పురుషం జాతమ్' ఆదియందే పురుష ఉద్భవించాడు అని తెలుపుతున్నాడు. యజుర్వేదం ఇదే అభిప్రాయాన్ని 'పూర్వఃజాతః' అని వెల్లడించింది. ఈ విషయాన్ని యజుర్వేదం ఇంకా వివరిస్తుంది.'ఆయనకు మునుపు ఏ ఉనికి లేదు'. ప్రభువైన యేసుక్రీస్తును గురించి కొలస్స. 1:15–17లో పేర్కొన్న విషయం 'ఆయన అదృశ్య దేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆది సంభూతుడై ఉన్నాడు. సృష్టిలో అన్నీ ఆయన వల్ల ఉనికిలోకి వచ్చాయి. ఆకాశాలలో ఉన్నవి, భూమి మీద ఉన్నవి, కనబడేవి, కనబడనివి, సమస్తాన్ని ఆయన ద్వారా, ఆయనకోసం సృజించడం జరిగింది. ఆయనే అన్నిటికీ పూర్వమున్నవాడు. ఆయనలోనే, అన్నిటికీ ఆధారం వుంది'. ఇంకా హెబ్రీలో ఇదే విషయం వుంది. 'దేవుడు ఆది సంభూతుడని మరలా రప్పించినపుడు...' అనే వాక్యం ఇదే (హెబ్రీ. 1:6).

వేదాల అనుగుణంగా చూసినా, ఆది సంభవుడు పురుషకు మునుపు, ఏ ఉనికీ లేదని తెలుస్తుంది. ఎలాగైతేనేం, హెబ్రీలోని పై వాక్యం, దైవం తన ఆది సంభవుని భూలోకంలోకి రప్పించాడని తెలుపుతుంది. దేవుడు ఈ పురుషకు విభిన్నమైనవాడా? మనం ఇంతకు ముందు తెలుసుకున్నట్లు సర్వేశుడైన ప్రజాపతి, పురుష, ఒకటే, ఒకే దైవం. కొలస్సయులకు పత్రికలో పైన పేర్కొనబడిన వచనం కూడ స్పష్టమైన జవాబునిస్తుంది. ఈ లోకంలో మానవుడుగా ఉద్భవించిన క్రీస్తుయేసు అదృశ్యుడై వున్న దేవుని స్వరూపమైయున్నాడు. మరి దృశ్యుడగు దైవం ఎక్కడ వున్నాడు? ఆయన పరమండలంలో వున్నాడు. ఆయన సమాధానం విశ్వమంతటిబి వ్యాపించి వుంది. పరుష యొక్క మహిమ మూడు వంతులు పరలోకంలో ఉన్నదని, పురుషసూక్తలో చదువుకున్నాము. ఆయన మహిమలో నాల్గవ వంతు మాత్రమే ఈలోకంలో ప్రత్యక్షమై వుంది. మానవుడుగా ఈ భువిలో ప్రత్యక్షమైనాడు. పురుష సూక్తలో చెప్పబడిన దైవ మహిమలోని నాలవ్గ భాగమే, ఈ లోకంలో ప్రత్యక్షమైందనే వాక్యం యొక్క భావమేమిటి? దేవుని యొక్క సంపూర్ణత క్రీస్తులో అమరి వుంది. అయితే ఆయన స్వచ్ఛందంగా తనను తాను రిక్తునిగా చేసుకున్నాడు. దీన మానవుడుగా భూలోకంలో కన్యక మరియకు జన్మించాడు. అయితే ఈ పురుషకు ఆరంభం వున్నదా? లేదు. ఆయన అనంతుడు. నిత్యజీవము గలవాడు. ఆది అంతము లేనివాడు. క్లుప్తంగా మానవుడైన క్రీస్తు యేసులో దేవుని యొక్క సంపూర్ణత, నివసిస్తున్నదని చెప్పవచ్చు. సంస్కృత భాషలో, పురుష యొక్క నిర్వచనాన్ని మనం గమనిద్దాం. 'పూర్ణత్వాత్ పురుష' 'పరిపూర్ణుడైన ఆ ఒక్కడే పురుష' అని భావం.

## చిక్కు విడిపోయింది

ప్రదర్శన కాంతి, ఉపనిషత్తులో అతి కష్టమైన భాగం. మధ్యాహ్నవేళ సూర్యకాంతివలె తేటతెల్లమైనది. ఇచ్చట వాక్యోపనిషత్తులోని, శాంతి పాదం నుండి ఒక వచనం చూద్దాం.

'ఓం పూర్ణ మదః, పూర్ణ మిదం
పూర్ణాత్ పూర్ణముదస్యతేః
పూర్ణశ్య, పూర్ణమాదాయ
పూర్ణమేవా అవశిశ్యతేః'

భావం : ఓం, అది పూర్ణం, ఇది పూర్ణం, పూర్ణత్వం, పూరణత్వం నుండే ఆరంభమగును. పూర్ణత్వం నుండి పూర్ణత్వమే శేషిస్తుంది.

ఈ పరిపూర్ణత భగవంతునిలోనే ఉంటుందని నిస్సందేహంగా తెలుపవచ్చును. ప్రజా+పతి=నరేశుడు (అందరికి ప్రభువు). పరిపూర్ణుడు, పాపరహితుడు, మానవుడైన క్రీస్తు యేసు, పురుష, ఈ అవనిలో వెలిశాడు. పరిపూర్ణతలో నుండి పూర్ణమైనది వెలువడుతుంది. పరిశుద్ధ యోహాను 'దేవుని వాక్యము శరీరధారియై, కృపా సత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. తండ్రి వలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె, మనమూ ఆయన మహిమను కనుగొంటిమి (యోహాను 1:14). ఇదేవిధంగా, బాప్తిస్మమిచ్చు యోహాను 'యేసుక్రీస్తు పరిపూర్ణతలో నుండి మన మందరమూ కృప వెంబడి కృపను పొందితిమి' అని వక్కాణించాడు (యోహాను 1:16).

సీరియల్

# అత్యంత ప్రియమైన అమ్మ

6

## (దేవుని బలిష్టమైన చేతిలో దీనపాత్ర కీ.శే. శ్రీమతి వై.యస్. జయమ్మ)

"యేసు – చిన్నపిల్లలను ఆటంకపరచక వారిని నా యొద్దకు రానియ్యుడి పరలోకరాజ్యము ఈలాటివారిదని వారితో చెప్పెను" మత్తయి 19:14. ప్రపంచంలో పిల్లలు ఎంతో నమ్మకమైనవారు. వారు పెరిగే వయసులో జీవితం గురించి ఆలోచించటం ప్రారంభిస్తారు. ఏది సత్యమో తెలుసుకొని, దానిని వెంబడించాలని కోరతారు. దీనికి ఎంతో సమయం, ఓర్పు, గ్రహింపు అవసరం. వారి దగ్గరకు వెళ్ళడానికి నిజమైన ప్రేమ అవసరం. ఈ చిన్నవయస్సులోనే వాస్తవంగా అనేకులు యేసును అంగీకరిస్తున్నారు. యౌవనంలో యేసుక్రీస్తును అంగీకరించిన అనుభవం మా తల్లికి వుంది. అందుచేత మేము పిల్లలుగా వున్నప్పుడే మాకు యేసుక్రీస్తును పరిచయం చేయాలని ఎంతో ప్రయాసపడింది. ఆమె బలమైన పునాది కారణంగా, ఆమె పిల్లలమైన మేమంతా క్రీస్తుమార్గంలో నడుస్తూ వున్నాం. ఆమె నిస్వార్ధ జీవితమునుబట్టి, ఆమె పిల్లలందరు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రు ఆమెకు పరిచర్య చేయడం ఆధిక్యతగా భావించారు. మేమందరం చెప్పగలిగింది ఏమంటే, ఆమెకు పరిచర్య చేసే అవకాశం మాకెన్నడూ యివ్వలేదు.

**7. పవిత్ర జీవితం జీవించుట మరియు మంచి కార్యాలు చేయుట :**

మా తల్లి పరిశుద్ధ జీవితం జీవించింది. ఎల్లప్పుడూ ఇతరులకు సహాయం చేసింది, నిరాడంబమైన నిస్వార్ధ జీవితం కొనసాగించింది. దేవుని వాక్యం ప్రకటించింది. ఆమెకున్న సహాయపడే స్వభావం, సమస్త మంచి కార్యాలు చేయుటలో ఆమె సమర్పణ అందరికీ తెలుసు.

మా తల్లిదండ్రులు సహాయం చేసిన మా గ్రామ మహిళ సరస్వతితో నేను మాట్లాడాను. ఆమె భర్త ఆమెను చిత్రహింసలు పెట్టినప్పుడు ఆత్మహత్య చేసుకొనుటకు ప్రయత్నించింది. ఆమె తన శరీరం మీద కిరసనాయిలు పోసుకొని అంటించుకున్న సమయంలో ఎవరో ఆమెను కాపాడి నా తల్లి దగ్గరకు తీసుకొని వచ్చారు. అమ్మ మా ఆసుపత్రిలో ఆమెకు ఉచిత చికిత్స చేయించారు. ఆమె సాధారణ స్థితికి వచ్చే వరకు అన్ని రకాలుగా మా తల్లిదండ్రులు సహాయం చేశారు. మా కళాశాలలో ఆమెకు ఉద్యోగం యిచ్చారు. గవర్నమెంటు చౌకధరల దుకాణం పెట్టుకొనుటకు సహాయం చేశారు. ప్రతి సందర్భంలో ఆమెకు నైతిక ప్రోత్సాహం యిచ్చారు. ఇదంతా ఆమె తన ఇద్దరు పిల్లలను చక్కగా చదివించుకొని, వివాహాలు చేయుటకు సహాయపడింది.

నేను మా తల్లి గురించి ఆమెతో మాట్లాడినప్పుడు, ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది. ఆమె రోజుకు రెండుసార్లు అమ్మను కలిసేదని చెప్పింది. మా తల్లి ఆమెకు దేవుని వాక్యం చెప్పేదిగాని ఎన్నడూ బాప్తిస్మం తీసుకొమ్మని ఆమెను బలవంతం చేయలేదు. అనేకసార్లు ఆర్థికంగా కూడ మా తల్లి సహాయం చేసిందని ఆమె చెప్పింది. ఆమె మంచం ఎదురుగా మా తల్లిదండ్రుల ఫోటో గోడకు తగిలించుకుంది. ప్రతి ఉదయాన్నే లేచిన వెంటనే ఆమె చేసే పని ఏమంటే వారు ఆమెకు చేసిన సహాయం గురించి తలంచటం. మా తల్లిదండ్రుల ద్వారా ఆమెవలె సహాయం పొందిన అనేకులు మా గ్రామంలో వున్నారు.

మరొక స్త్రీ హెలీనమ్మ. ప్రభువునందు నిద్రించిన స్థానిక సంఘకాపరి రెవ. దేవదానంగారి భార్య మా తల్లి గురించి సాక్ష్యము చెప్పింది. 1988లో వారు ప్రొద్దుటూరు నుండి పులివెందులకు బదిలీ అయినప్పుడు మా తల్లి తన పట్ల చూపిన ప్రేమను ఆమె వివరించింది. మా తల్లి ఆమె గృహాన్ని దర్శించి, కుటుంబానికి దూరంగా ప్రొద్దుటూరులో ఆమె ఒంటరిగా పడుచున్న ప్రయాస చూసి ఆమెను పులివెందులకు బదలీ చేయుంచుటకు సహాయపడింది. మా తల్లి ఆమెకు చేసిన సహాయాన్ని ఎన్నడూ మరువలేను అని హెలీనమ్మ చెప్పింది.

ప్రతి ఆదివారం ఆలయంలో మరియు స్త్రీల సహ వాసంలో వారిద్దరూ కలుసుకునేవారు. తరువాత వీరు గొప్ప స్నేహితులైనారు. స్త్రీల సహవాసంలోని ఇతర సభ్యులందర్నీ మా తల్లి ఏ విధంగా చూసుకునేదో అనే విషయం కూడ హెలీనమ్మ వివరించింది. వారందరి సమస్య లన్నీ మా తల్లి ఎంతో ఓర్పుతో వినేదని, వారి గురించి ప్రార్ధన చేసి, తన పరిధిలో వారికి తగిన సహాయం చేసేదని చెప్పింది. ధనికులు

మరియు పేదల మధ్య ఆమె ఎన్నడూ వ్యత్యాసం చూపేది కాదు. ఆమె వారందరి గృహాలు దర్శించి, వారేమి అల్పాహారం పెడితే దానిని తినేది. ఒకరోజు ఒక సంఘ సభ్యురాలి గృహానికి వెళ్ళింది. ఆ గృహము మొదటి అంతస్థులో వుంది. అప్పుడు మెట్లు ఎక్కుటకు మా తల్లి బలహీనంగా వున్నప్పటికీ ఏమి వెనుకాడకుండా మెట్లన్నీ ఎక్కి వారి ఇంట్లో ప్రవేశించి వారితో కొంత సమయం ప్రార్థనలో గడిపింది. ఆమె ప్రేమ, దీనత్వం అటువంటివి.

వివిధ గ్రామాలలో సువార్తను ప్రకటించడానికి వెళ్ళే సంఘ బృందంతో పాటు తను కూడా వెళ్ళడానికి మా తల్లి ఎంతో ఆసక్తి చూపేది. వారందరికీ తన స్వంత కారులో ఆ గ్రామాలకు ఆమె తీసుకొని వెళ్ళేది. ఆమె తీవ్ర అస్వస్థతతో ఉన్నప్పటికీ ఏనాడు ఆదివారపు సంఘారాధన మానలేదు.

**8. ఆదర్శ గృహనిర్వాహకత్వం :**

మా తల్లి ఆదర్శ గృహనిర్వాహకురాలు. ఆమె ఎంతో నేర్పరియైన గృహ యజమానురాలు. ఆమె ఎంతో సామర్థ్యంతో గృహ కార్యకలాపాలను నిర్వర్తించేది. అతిథులను ఎంతగానో ఆదరించి, సత్కరించేది. సేవకు వచ్చిన మిషనరీలను తన ఇంట్లోనే బస చేయమని కోరేది, వారి బాగోగులు చక్కగా చూసుకొనేది. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించుటకు మా గ్రామానికి వచ్చిన వైద్యులందరికీ భోజనం పెట్టుటకు ఎల్లవేళలా సిద్ధంగా వుండేది. తన గుమ్మం వద్దకు వచ్చే భిక్షకులకు ఎల్లప్పుడూ భోజనం పెట్టి వారి ఆకలి తీర్చేది.

మా తల్లి ఇంట్లోని అనుదిన కార్యకలాపాలు చూసుకోవడం మాత్రమే కాకుండా మా తండ్రికి ఎంతో సహకారం అందించేది. ఆమె పెద్దలను, బంధువులను కూడ మర్యాదగా చూసేది. ఆమె వదినా మరదళ్లందర్నీ ఎంతో ప్రేమించింది. అందుచేత వారిలో ముగ్గురు పదవీ విరమణ తర్వాత వారి పిల్లల దగ్గర వుండకుండా మా తల్లికి సమీపంలో స్థిరపడాలని తీర్మానించుకున్నారు.

నేను చదివిన పుస్తకంలో ప్రస్తావించిన మార్గనిర్దేశి లక్షణాలన్నీ మా తల్లిలో వున్నాయని చెప్పుటకు గర్వపడుచున్నాను. ఆమె ఆదర్శ మాతృమూర్తి. అందరిచే గౌరవించబడిన తల్లి. ఆమె మనకు ఈ విధంగా చెప్తుందని నేను భావిస్తున్నాను. "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి" 1కొరింథి. 11:1. "మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని" 2తిమోతి 4:7.

## శ్రీమతి జయమ్మ ప్రార్థనా యోధురాలు

"యెహోవా దృష్టి ఆయనయందు భయభక్తులు గలవారి మీదను ఆయన కృపకొరకు కనిపెట్టు వారిమీదను నిలుచు చున్నది" కీర్తన 33:19.

మా జీవితాల్లోని అనేక సంధర్భాల్లో ప్రాముఖ్యంగా మా తల్లి ప్రార్థనలు మమ్మును ప్రభావితం చేశాయి. వీటిలో కొన్ని సంఘటనలు ఇక్కడ నేను ప్రస్తావిస్తున్నాను.

మా పెద్దన్న జార్జిరెడ్డి యౌవనంలో వున్నప్పుడు చాల భక్తిగా వుండేవాడు. అనంతపూరు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుచున్నప్పుడు గిటార్ వాయిస్తూ, మంచి పాటలు పాడుతూ యేసుప్రభువును ఘనపరచేవాడు. తరువాత అతడు దేవునికి దూరమైపోయి ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాడు. అతనికి ఏదైన పెద్ద సమస్య వచ్చిన ప్రతీసారి, అతడు, అతని భార్య భారతి, ప్రార్థనల కొరకు మా తల్లి దగ్గరకు వెళ్ళేవారు. వారి సమస్యలు ఆమెతో చెప్పుకునేవారు. మా తల్లి ప్రార్థనల వలన అని పరిష్కరించబడేవి. ప్రస్తుతం మా వదిన ఆమె పిల్లలందరి గురించి ప్రార్థన చేస్తూ వుంది. ఫలితంగా వారు ఆశీర్వదించబడినారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయిన మా రెండవ అన్న రాజశేఖర్‌రెడ్డి యౌవనంలో వున్నప్పుడు ఆలయానికి క్రమంగా వెళ్ళేవాడు. అతడు వైద్య కళాశాలలో వున్నప్పుడు ప్రమాదానికి గురైనాడు. అప్పుడు మా తల్లి ప్రార్థనల వలన బ్రతికి క్షేమంగా వున్నడు. 1977వ సంవత్సరంలో సచివాలయంలో తుపాకితో కాల్చబడినప్పుడు సహితం మా తల్లి ప్రార్థనల వలన కాపాడబడినాడు.

ప్రస్తుతం ముఖ్యమంత్రి భార్య శ్రీమతి విజయక్ష్మి ప్రార్థనా భారాన్ని హృదయపూర్వకంగా స్వీకరించింది. మా కొరకు మరియు రాష్ట్రమంతటి గురించి ఆమె ప్రార్థన చేస్తూ వుంది. వారి కుటుంబమంతా ప్రార్థనా యోధులుగా మారారు. దేవుని రాజ్యం కట్టుటలో వారు ఎంతో కృషి చేస్తున్నారు. వారందరు యేసుక్రీస్తులోనికి రావడం చూసి మా తల్లి ఎంతగానో సంతోషించింది. మా అన్న అల్లుడు అనిల్‌కుమార్ సంపూర్ణ సువార్తికునిగా సేవచేస్తున్నాడు. షర్మిలా కూడ దేవుని సేవచేస్తూ వుంది.

(సశేషం)

# మదర్ తెరీసా

28 ఫిబ్రవరి, 1949 సాయంకాలం మదర్ తెరీసా వచ్చి ఆ మేడగదిలో ప్రవేశించింది. ఆమెతో పాటు చారుమా అనే విధవరాలు కూడా వచ్చింది. లొరెటో స్కూల్లో మదర్ పని చేసేటప్పుడు చారుమా మదర్‌కి వంట చేసిపెట్టేది. మదర్ అంటే ఆమెకు పంచప్రాణాలు. మదర్ మేడగదిని ఆక్రమించుకున్నారు. ఉదయాన్నే నాలుగున్నరకల్లా లేవడం, ఆరుగంటలకల్లా ధ్యానం, ప్రార్ధనలు, టిఫిన్ ముగించుకొని బడికి వెళ్ళి పిల్లల్ని చూచుకొని అక్కడ నుండి మురికి వాడల్లోకి వెళ్ళి నిరుపేదల మధ్య సేవచెయ్యడం ఆమె దినచర్య. అయితే ఒక్కతే అంత భారమైన పనిచెయ్యడం, అవసరతలో నున్న వారందరి దగ్గరకు వెళ్లడం అసాధ్యము అనిపించింది. ఈ విషయంలో దేవుని ప్రార్ధించేది. గదిలో ఒక బెంచి, ఒక పాతపెట్టె, ఒక కుర్చీ, ఒక చిన్న పాత బీరువా మాత్రం వున్నాయి. బెంచీ మీద తన పుస్తకాలను పెట్టుకుంది. బీరువా మీద బైబిల్ గ్రంథాన్ని, మేరిమాత విగ్రహాన్ని పెట్టుకుంది. కొన్ని రోజుల వరకు ఆమె క్రిందనే పడుకుంది. అది చూచిన లొరిటె సిస్టర్స్ ఆమెకు ఒక పరుపును పంపించారు. ఒంటరిగా మొదలైన సేవ భారమని పించేది. సాయంకాలం అలసిపోయి తన గదికి వస్తే కనీసం పలకరించే వాళ్ళు కూడా లేకుండాపోయారు. కొన్నిసార్లు తినడానికి ఏమీ ఉండేదికాదు. అలాగే పస్తులు పడుకొనేది. మరీ ఆకలి బాధకు తట్టుకోలేక పోయినప్పుడు, నెమ్మదిగా మెట్లు దిగి గోమ్స్‌ను అడిగేది. ఒంటరితనం ఆమెను కృంగదీసేది. ఆకలి బాధ నిరుత్సాహ పరిచేది.

ఒకరోజు ఉదయాన్నే సెయింట్ మేరీస్ పూర్వ విద్యార్థిని అయిన సుభాషిణిదాస్ తలుపు తట్టి నిలుచుంది. మదర్ తెరీసా ఆశ్చర్యంతో ఆమెను చూసి పిల్లలకు చదువు చెప్పాలని, పేద రోగులను రక్షించమని ప్రోత్సహించేది. మదర్ తెరీసా స్థాపించిన క్రొత్త జీవితంలో తను కూడా పాలిభాగస్తురాలిగా కావాలని నిశ్చయించుకొని వచ్చినట్లు సుభాషిని చెప్పింది. మదర్ తెరీసా ఆమెను వారించి, ఆ కఠినమైన జీవితానికి నీవు సిద్ధపాటుగా వున్నావా అని అడిగింది. సుభాషిణి తను అంతా తెలుసుకుని ఎంత కష్టమైనా భరించి వుండి సేవ చేయుటకు నిశ్చయించు కున్నానని చెప్పింది. అయితే రెండు వారాల తరువాత మరలా ఆలోచించుకొని రమ్మని సుభాషిణిని పంపించింది మదర్ తెరీసా. మదర్ చెప్పిన రోజుకి సుభాషిణి వచ్చింది. ఆమె మొట్టమొదటిగా మదర్ తెరీసాతో పేదవారి సేవలో కొనసాగింది. సుభాషిణిలో మరో విశేషమేమంటే ఆమె నన్‌గా ప్రమాణము చేసేటప్పుడు మదర్ తెరీసా యొక్క మొట్టమొదటి పేరైన ఆగ్నెస్‌ను తనకు ఇష్టమైన పేరుగా స్వీకరించి సిస్టర్ ఆగ్నెస్ అయింది. ఈమె 9 ఏప్రిల్, 1997న చనిపోయినపుడు మదర్ తెరీసా అదే సంవత్సరము సెప్టెంబరు 5వ తేదీన మరణించారు. ఎంత చక్కని దేవుని ప్రణాళిక గదా వీరిద్దరి యెడల.

సుభాషిణి క్రీక్‌లేన్ ఇంటికి రావడము మదర్ తెరీసాకు ఎంతో ప్రాముఖ్యమైనది. ఆమె రాక దేవుని ఆశీర్వాదముగా భావించి తను సరైన మార్గములోనే వెళ్తున్నట్లుగా మదర్ తెరీసా ధృవీకరించుకున్నారు. కొన్ని వారాల తర్వాత మరొక పూర్వ విద్యార్థిని మగ్దలేనా గోమ్స్ వచ్చి చేరింది. ఆమె సిస్టర్ గెట్రూడ్ అనే పేరు పెట్టుకుంది. సిస్టర్ ఆగ్నెస్ టీచర్ ట్రైనింగ్ కోర్సు మధ్యలో వదలి వచ్చినందున, ఆ కోర్సును పూర్తి చేయవలసిందిగా మదర్ తెరీసా కోరింది. మదర్ తెరీసా పాట్నాలో మెడికల్ ట్రైనింగ్ అయినపుడు ఒక డాక్టరు యొక్క ప్రాధాన్యం సేవలో ఎంతో వుంటుందని గ్రహించి సిస్టర్ గెర్‌ట్రూడ్‌ను ఎం.బి.బి.యస్. చేయడానికి ప్రోత్సహించి చివరకు ఆమెను డాక్టరుగా వెస్ట్‌బెంగాల్ ఎం.బి.బి.యస్. ఫైనల్ ఇయర్ పరీక్షల్లో మూడవ స్థానంలో వచ్చేట్లు ప్రోత్సహించింది.

ఈ ముగ్గురు సిస్టర్స్ మురికి వాడల్లో సేవసాగిస్తున్నారు. కొన్ని సమయాల్లో డబ్బు వుండేది కాదు. భోజనానికి కూడ లేక పస్తులుండేవారు. మదర్ తెరీసా సంస్థలో చేరేవారు చేయవలసిన వాగ్దానమేమంటే నిరుపేత ప్రజలకు మన స్ఫూర్తిగా ఉచిత సేవ చేస్తారని ప్రమాణం చేయడమే. ఇది ప్రధానమైన వాగ్దానము. ధైర్యంగా నవ్వుతూ సేవ చేయాలి. ఎందుకంటే వాళ్ళు నిర్భాగ్యులైన పేదవారు. వారి ముఖాలలో ఏ మాత్రం కాంతి వుండదు. కళ్ళవెంట నీరు కారుతూ వుంటుంది. మీరు నవ్వుతూ సేవ చేయడం వలన ప్రభువు యొక్క ప్రేమ వారి మధ్యకు వచ్చి వెలుగులా వారియందు ప్రవేశిస్తుంది. ఏ పేదవారి దగ్గర డబ్బు తీసుకోరాదు. ఇవి ఖచ్చితంగా పాటించాల్సిన నియమాలు.

ప్రభువా ఇద్దరు సిస్టర్స్‌ను ఏర్పరచినందుకు వందనాలు.

ఇంకా ఎనిమిది మంది కొరకు ప్రార్థన చేస్తున్నాను. ఆలకించి దయచేస్తే నీ పని ముందుకు తీసుకెళతాను. మూడో అమ్మాయి చేరింది. నాల్గవ అమ్మాయి చేరింది. మదర్ తెరీసా కడు పేదలైన వారు చేయి చాచి అడిగితే ఏనాడూ కాదనలేదు. ఆమె వద్ద ఉన్న ఆఖరు రూపాయి ఇచ్చి వేసేవారు. కొన్ని సమయాల్లో ప్రయాణానికి వున్న డబ్బు ఇచ్చి ఎంతో దూరం కష్టపడి నడిచేవారు.

మోజిల్, తిల్‌జాలలో వున్న రోగుల్ని మరువకుండా చూస్తుండేవారు. ఒకసారి కాలవలసిన మందులు లిస్టు పట్టుకొని మైఖేల్ గోమ్స్‌తో కలసి ఒక పెద్ద మందుల కంపెనీకి వెళ్ళి మందులు దానం చేయవలసినదిగా అర్థించింది. ఆ షాపులోని వారు తెలియక తప్పుగా ఇక్కడి వచ్చారండి మరొక చోటు చూసుకోండి అన్నప్పుడు మదర్ తెరీసా ప్రక్కనే మోకరించి ప్రభువుకు ప్రార్థన చేసింది. ఆ షాపువారు ఒక సంచీ నిండా మందులు ఇచ్చి ఇక వెళ్ళి రామ్మా అన్నప్పుడు దేవుడు మిమ్మల్ని దీవించుగాక అని వారిని ఆశీర్వదించింది. ఈ మందులు మా కంపెనీ కానుకగా భావించమని కోరారు. ఎంత చక్కని ప్రభువు తోడ్పాటు. హృదయాలు మార్చే దేవుడు, తలంపులను కలిగించే దేవుడు. ఆయన చెంత వుంటే చాలు. మనతో ఆయన పని చేయించుకునే దేవుడు అని మదర్ తెరీసా అనుకున్నారు.

కొందరు రోగులు స్పర్శ లేకుండా పడి వుండిన వాళ్ళున్నారు. ఒక మనిషి పాతగా బలహీనపడి వున్నాడంటే తనను వారు కాపాడుకోలేని స్థితిలో ఉన్నాడు. ఈగలు, దోమలు, క్రిమి కీటకాలు ఆయన గాయాలపై గ్రుడ్లు పెట్టాయి. ఒక కాలు ఈ లార్వాలతో తిని వేయబడింది. కనీసం చూడటానికి కూడా మనసు పుట్టని స్థితిలో పడియున్నాడు. అతని వద్ద వాసనకు వాంతి అయ్యే పరిస్థితి. మదర్ తెరీసా ఆ మనిషిని శుభ్రం చేసి, ఆ లార్వాలనన్నీ పెరికివేసి, ఆ గాయాల్ని శుభ్రపరచి కట్టుకట్టింది. ఆ మనిషికి చేసిన ఆ సేవ యేసయ్యకే చేశాను గదా అనుకుంది. ఆ మనిషిని శుభ్రపరచి, కట్లు కట్టేటపుడు తన వద్ద వున్న సిస్టర్లతో ఇలా చెప్పింది. ఈ మనిషి యొక్క శరీరము ప్రభువైన యేసయ్యదేనని నా పూర్ణ హృదయంతో, పూర్ణాత్మతో నమ్మకుంటే, నేను ఒక్క క్షణం కూడా ఆ సేవ జరిపించలేని, భరించలేని పరిస్థితి. ఇదంతా ఎందుకు చేస్తున్నానంటే యేసయ్య దాహమును తీర్చడానికి. సిలువపై పలికిన అయిదవ మాట ఆ ప్రభువు అభ్యర్థన ఆయన ప్రేమను మిక్కిలి అల్పులైన వారికి పంచమని 'నేను దప్పిగొంటిని' సిలువపై యేసయ్య పటము క్రిందభాగములో ఈ మాటలు వ్రాసి ఆ పటాన్ని క్రీక్‌లేన్ ఇంట్లో హాలు గోడకు వ్రేలాడ దీయటం వలన చూసినపుడల్లా జ్ఞాపకం చేసుకునేవారు.

క్రొత్తగా చేరిన సిస్టరు చేతిని పట్టుకొని తన చేత్లో ఒక్కొక్క వ్రేలు ముడుస్తూ 'నీవు ఇది అంతా నాకు చేశావు' అన్న అయిదు మాటలు చెప్పేవారు. కొన్ని వారాల్లోనే ఇంకొందరు అమ్మాయిలు చేరారు. దేవుడు మదర్ తెరీసాను ఆమెకు దయచేస్తున్న విధానము ఆమెనే అబ్బుర పరస్తుండేది. కొందరైతే నమ్మశక్యంకాకుండా వుండే మదర్ తెరీసా ఆకర్షణ శక్తి అనుకున్నారు. కాని ఆమె ఎప్పుడూ దాని గురించి ఆలోచించేది కాదు. ఎందుకంటే అది ఆమె శక్తి కాదు. అది క్రీస్తు ప్రభువు వారి శక్తి వలన ఆ బిడ్డలు రాబట్టబడుచున్నారు. యేసయ్యే ఆమె శక్తి, బలము. ఆమె ఒక సంఘ సేవకురాలు కాదు. ఆమె సాయం చేసిన ప్రతి పేదవాడు యేసయ్యకు సహాయం చేసినట్లు అనుకునేది. ప్రభువు మత్తయి సువార్త 25వ అధ్యాయం 34-40 వరకు ఆయన మాటల్లో ఎవరూ చెప్పలేరన్నంత గొప్పగా చెప్పారు. "అప్పుడు రాజు తన కుడివైపున ఉన్న వారిని చూచి - నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి. నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి, దప్పిగొంటిని నాకు దాహమిచ్చితిరి, పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి, దిగంబరినై యుంటిని నాకు బట్టలిచ్చితిరి, రోగినైయుంటిని నన్ను చూడ వచ్చితిరి, చెరసాలలో ఉంటిని నా యొద్దకు వచ్చితిరని చెప్పును. అందుకు నీతిమంతులు - ప్రభువా, ఎప్పుడు నీవు ఆకలిగొనియుండుట చూచి నీకాహారమిచ్చితిమి? నీవు దప్పిగొనియుండుట చూచి ఎప్పుడు దాహమిచ్చితిమి? ఎప్పుడు పరదేశివైయుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివైయుండుట చూచి బట్టలిచ్చితిమి? ఎప్పుడు రోగివై యుండుటయైనను, చెరసాలలో ఉండుటయైనను చూచి నీ యొద్దకు వచ్చితిమని ఆయనను అడిగెదరు. అందుకు రాజు - మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును'. ఇదే మదర్ తెరీసా మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ యొక్క కాన్‌స్టిట్యూషన్‌లోని ప్రధాన భాగమైనది. ప్రభువైన యేసయ్య మాటలు ఎప్పుడూ తన హృదయంలో పదిలంగా వుంటూ వాటి ఆచరణే ఆమె జీవిత ధ్యేయమైనందున ఏనాడూ అపజయము పొందలేదు. అపవాదికి చిక్కలేదు.

పెద్ద కథ

# విశ్వాసంలో ఓ మెట్టు

36

1974లో తండ్రితో విభేధించి ఇంటి నుండి బయటికి వెళ్లిపోయిన తర్వాత పధ్నాలుగు సంవత్సరాలు గడిచాయి. 1982 జనవరి 22న తల్లి చనిపోయినప్పుడు, 1987లో తండ్రి చనిపోయినప్పుడు తప్ప తను ఆ యింటికి, ఆ వీధికి సంబంధించిన వాడినికాను, తనకు అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు ఉన్నారని తను మర్చిపోయాడు. తన పిల్లలలో కొంత మందికి వారి చుట్టాలెవరో, తన తండ్రి యింటి వారిలో చాలా మంది తెలియదు. తనకు ఇష్టం లేకపోయినా మరణించిన వారి జ్ఞాపకాలతో ఎక్కడో వున్న రక్తబంధముతో మరలా ఆ సంస్థానం వంటి ఇంటికి వచ్చి తన అయిదుగురు తమ్ముళ్ళను ఒకచోట సమావేశపరచి, వారిని ఒప్పించి, విశదపరచి, ఇప్పుడు వున్న బాకీలు ఎలా తీర్చాలో, తర్వాత చర్చీ, స్కూలు విషయాలలో ఎలా ప్రవర్తించాలో అన్ని విషయాలు ఓ కొలిక్కి వచ్చే సరికి ఐదు నెలలు పట్టింది. అప్పులు తీరిపోయాయి.

ఈ పనులన్నీ సరి చేయడానికి హాస్పిటల్ దగ్గర్లో వున్న అద్దె యింటి నుండి తండ్రి వలన పొందిన ఇంటిలోనికి కాపురం మారింది. వారానికి ఒకసారైనా ఓబన్నగారిని కలుస్తున్నందున స్నేహం పెరిగింది.

కనిగిరిలో ఉద్యోగం చేస్తున్నట్లయితే తండ్రి చనిపోయిన తర్వాత చేయాల్సిన పనులన్నీ చేయటానికి కుదిరేది కాదు. కనుక దేవుడే రాజకీయంగా, స్వార్థంతో జరిగిన బదలీ వ్యవహారమును సామ్యేలుకు అనుకూలంగా మార్చాడని అనుకున్నాడు సామ్యేలు. నిజానికి సామ్యేలు ఒంగోలులో ఉండటం ఈ సమయంలో అవసరం కనుకనే దేవుడు వారితో సామ్యేలుకు డిప్యూటేషన్ వేయించాడని తర్వాత సామ్యేలు తెలుసుకున్నాడు.

దేవుని సంకల్పం చొప్పున పిలువబడిన వారి కొరకు ప్రభువు జరిగించే కార్యములు మనకు చేదుగా అనిపించి నప్పుడు ఆ చేదును సంతోషంగా స్వీకరించాలి. కాని అది చేదుకాదని మన జీవితంలో మేలు కలిగించేందుకే అది దేవుడు ఏర్పాటు అని గ్రహించక మనం బాధపడుతుంటాం. దేవుడు అన్యాయము చేయుట అసంభవము.

హాస్పిటల్ స్టాఫ్‌లో ఎవరినైనా మరొక ఊరికి బదిలీ చేస్తే కన్నీరు మున్నీరుగా ఏడుస్తారు. తప్పేది లేక మరో ఊరు వెళ్ళినా ఒక నెలా రెండు నెలల తర్వాత, ఈ ఊరే బాగుంది అని ఇప్పుడు వచ్చిన ఊరిలో స్థిరపడిపోతారు.

ఒంగోలులో తల్లిదండ్రులు జీవించివున్నప్పుడు హాస్టల్స్, చర్చీలు, పనివారు, అందరి విషయాలు, బాధ్యతలు ఎక్కువగా నిర్వర్తించిన సామ్యేలు ఇప్పుడు తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయిన తరువాత మూలరాయి లేకుండా గోడకట్టటం ఎంత కష్టమో అర్థమయింది. తల్లిదండ్రులను అడ్డం పెట్టుకొని పరిపాలించి చోట తల్లిదండ్రుల అండలేనందున తన తమ్ముళ్ళు పెద్దవారై వారికి కూడ సంతానం కలిగియున్నందునను సామ్యేలు యొక్క పరిపాలనా దక్షత నెరుగని వారని ప్రతి విషయంలోను ప్రతిసారి ఒప్పించటం కష్టమయింది.

ఇంతకుపూర్వం ఇవన్నీ నావే అనుకునే సామ్యేలుకు ఇదంతా అందరిదీ, ప్రతి పనికి అందరికి లెక్క అప్పచెప్పాల్సి రావడం చాలా కష్టమనిపించింది. తను ఇంటికి దూరంలో వున్నప్పుడు పొలాలు, స్థలాలు చాలా అమ్మబడినవి. నాలుగు కార్లు వున్న సంస్థానంలో చిన్న మోటారు బైకు కూడా లేదు. నడుస్తున్న బడి, గుడి, అన్నదమ్ములందరూ ట్రస్టీలుగా వుండి నడిపేటట్లుగా ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికి నలుగురు కుమార్తెలకు వివాహం జరిపించాడు. కనుక పెద్ద కుమారునికి వివాహం జరిపించి ఒంగోలులోనే వుంచి తను అయిదు నెలలకు డాక్టరు సర్టిఫికేటు తీసుకొని ఒంగోలులో ఉద్యోగంలో చేరిన వెంటనే మరలా ఒంగోలు నుండి కనిగిరి పంపించేశారు.

తల్లిదండ్రులు తమ పిల్లల కొరకు ఎన్నో ఘనమైన విషయాలు ఆలోచిస్తారు. కొందరు తమ పిల్లలు గొప్ప చదువులు చదవాలని, గొప్ప ఉద్యోగాలు చెయ్యాలని వారు పేరు ప్రతిష్టలు కలిగినవారైనప్పుడు చూచి ఆనందించాలని ఎన్నో కలలు కంటారు. కొందరు తల్లిదండ్రులు ఈ లోకంలో వారి యొక్క స్థితినిబట్టి తమ పిల్లల భవిష్యత్తు విషయం ఏమీ ఆలోచించలేరు. ఎందుకంటే ప్రతిదినము నిద్రలేచిన దగ్గ ర్నుండి నిద్రపోయేంత వరకు దినాహారము కొరకు అప్పులు, అనారోగ్యములాంటి దిగుళ్ళతో భవిష్యత్తు ఏమీ లేనట్లుగానే జీవిస్తారు.

గొప్పవారైనా, బీదవారైన అందరి భవిష్యత్తులు దేవుని చేతిలో వున్నాయి. దేవునియందలి భయభక్తులు కలిగిన తల్లిదండ్రులు వారి బిడ్డల కొరకు ప్రార్ధిస్తారు. ముగ్గురు ఆడపిల్లలు వరుసగా కలిగిన సామ్యేలు తల్లిదండ్రులు మగపిల్లవాని కొరకు దేవుని ఎంతగానో బ్రతిమిలాడు కున్నారు. అంతేకాక దేవునికి కూడా మొక్కుబడి చేసుకున్నారు. మాకు కుమారుని దయచేస్తే నీ సేవకే సమర్పించుకుంటామన్నారు. చిన్నతనం నుండి అలానే పెంచారు. బి.ఎ. చదివిన తర్వాత కొంతకాలం సేవకుడిగా ఉన్నాడు. పెళ్ళయిన తర్వాత గొప్ప విశ్వాసిగా నడిచాడు. కాని కార్లు, సంపద కలిగిన తర్వాత కుటుంబం మొత్తంలో  ముందుగా దేవునికి దూరమయ్యింది సామ్యేలే.

సామ్యేలు తల్లిదండ్రులు వారు చనిపోయేటంత వరకు సామ్యేలును దేవుని సేవలో చూడాలని దేవుని ప్రార్థించారు. కాని గవర్నమెంటు డ్రైవరుగానే చూస్తూ చనిపోయారు. కనిగిరిలో ఉద్యోగం చేస్తున్నన్ని రోజులు అంటే తొమ్మిది సంవత్సరాలలో ఒక్కసారైనా ఏ ప్రార్ధనా మందిరమునకు వెళ్ళలేదు. ఒంటరిగా ఎన్నడూ ప్రార్ధన చేసుకోలేదు. కాని రోజుకు రెండు గంటలైనా బైబిలును చదివి ధ్యానించేవాడు. ఒక కన్నుకు శుక్లం వచ్చినా ఒంటి కన్నుతోనైనా రాత్రిళ్లు మెలకువ వచ్చినప్పుడల్లా బైబిలు చదువుతుండేవాడు. క్యాంపులకు వేరే ఊరు వెళ్ళేటప్పుడు కూడా బైబిలు చదువుతుండేవాడు. క్యాంపులకు వెళ్ళేటప్పుడు తనతో తీసుకెళ్ళే క్రొత్త నిబంధన బైబిలులా ఉండక ఒక నవల గ్రంథంలాగా కనబడేది. అందువల్ల నోట నుండి వచ్చే వాసనకు తగని పుస్తకం (బైబిలు) చదువుతున్నాడని ఎవరూ అనుకునే వారు కాదు.

ఒకసారి వారం రోజులు ఒంటరిగా ఇంట్లో వుండాల్సి వచ్చింది. సావిత్రి తన ఏకైక కుమార్తెతో ఒంగోలులోని తన పుట్టింటికి వెళ్ళింది. పిల్లలు బడికి వెళ్ళారు. సామ్యేలుకు ఏమీ తోచలేదు. తెల్లకాగితాల పుస్తకం ఒకటి తీసుకొని, తను కూడా కథలు రాసే కవినయితే! అని ఆశ్చర్యపోయే వాడు. కవినైతే? ఈ కోరిక చాలసార్లు కలిగేది. కవి కావాలంటే పెట్టి పుట్టాలి అనుకునేవాడు.

చిన్నప్పుడు తన తమ్ముడు జోషితో కలసి నీళ్ళగుంటల్లో కాలువల్లో, సముద్రములో చాలాసార్లు ఈత నేర్చుకోవాలని అలసిపోయి, విసిగిపోయేంత వరకు ప్రయత్నం చేసి చేసి విసికిపోయి ఆ ప్రయత్నం మానుకున్నాడు. అప్పటి నుండి ఈత కొట్టే వాళ్ళను చూస్తే పట్టరాని కోపం వచ్చేది.

అలానే ఏదైనా కథ రాస్తే బాగుండు అని వ్రాయడం ప్రారంభించాడు. "సైనికులు యోసేపు చేతులకు సంకెళ్ళు వేసి కొట్టుకుంటూ నెట్టుకుంటూ నేలలో వుండే చెరసాల తలుపు తీసి లోపలికి బలంగా నెట్టారు. లోపల బోర్లా పడ్డాడు. నేల చల్లగా వునిది. గడ్డి పోచలు వున్నాయి. సైనికులు తలుపువేసి వెళ్ళిపోయారు. వెళ్తూ ఎగతాళిగా 'వీడికి సైన్యాధిపతి భార్య కావాలంట' అన్న మాట, తర్వాత నవ్వటం విని ఖిన్నుడైనాడు. ఒక ఎలుకు తన మీదుగా పరుగెత్తింది. దాన్ని చూసి భయపడలేదు. రేపట్నుండి నా స్నేహం నీతోనే అనుకున్నాడు" – అంతవరకు రాసి చదువుకున్నాడు సామ్యేలు. బాగానే వుందే అనుకున్నాడు. రాసి రాసి అలసిపోయినట్లుగా అనిపించింది. బయటకు వెళ్ళి కొంచెం పుచ్చుకొని వచ్చి రాయలని అనుకున్నాడు. మళ్ళీ ఎప్పుడూ రాయలేదు. నేనేం కవినవుతానా ఏంటీ అనుకుని రాయడం మానుకున్నాడు. కాని బైబిలు చదవటం మానలేదు.

1978లో పుష్ప చనిపోయిన తర్వాత ఆరునెలలు ప్రెస్ పనిచేయకుండా పనివారికి అప్పచెప్పాడు సామ్యేలు. అప్పుడు ఒక ఆలోచన వచ్చింది. యేసుకథను బైబిల్లో కథగా, జీవిత చరిత్రగా ఎందుకు వ్రాయలేదు అని. సరే, నాలుగు సువార్తలలో వున్నదంతా కలిపి ఒక కథలాగా ఎవరైనా వ్రాశారనుకున్నా తను అలాంటి కథను చూడలేదు. కనుక నేనే వ్రాస్తే ఎలా వుంటుంది? అనుకొని, నాలుగు సువార్తలు విడివిడిగా సంపాదించి తన ఎదురుగా పెట్టుకొని బైబిలులో ఒక సంఘటనను నలుగురు సువార్తికులు ఎలా వ్రాశారు? అవన్నీ కలిపి వ్రాశాడు. అలా ఒక సంవత్సరం కష్టపడి వ్రాసి మానేశాడు.

1980లో మరలా అలానే వ్రాయలని నిశ్చయించుకొని నాలుగు సువార్తలు 'యేసుకథ' లాగా వ్రాయటం ప్రారంభించాడు. కాని ఒక వారం రోజులు వ్రాస్తే, రెండు నెలలు మానేసేవాడు. 1990 జనవరిలో హైదరాబాదు సంజీవరెడ్డి నగర్‌లోని మెడికల్ అండ్ హెల్త్ వెహికల్స్ డిపార్ట్‌మెంట్ నుండి కనిగిరి ఆస్పత్రికి టెలీగ్రామ్ వచ్చింది. కనిగిరి ఆస్పత్రికి కేటాయించిన క్రొత్త అంబులెన్సును తీసుకెళ్ళటానికి డ్రైవర్‌ని హైదరాబాద్ పంపించమన్నారు.

మార్గదర్శి

# బ్రదర్ భక్తసింగ్

బ్రదర్ భక్తసింగ్ నోటినుండి వచ్చే ప్రతి మాటలో దేవుని జీవం వుంటుందని అనేకసార్లు తన కూటాల్లో ప్రభువు రుజువు పరిచాడు. ఆత్మల క్షేమంకోసం, దుర్బోధల నుండి తప్పించడం కోసం రాత్రింబవళ్ళు శ్రమించిన అపొస్తలుడు బ్రదర్ భక్తసింగ్.

ఒకసారి ఒక సహోదరుడు బ్రదర్ దగ్గరకు వచ్చి 'మీ తరువాత ఈ హెబ్రోనును ఎవరు చూస్తారు' అని ప్రశ్నించాడు. అప్పుడు సహోదరుడు 'ఇది నా పని కాదు. దేవుని పని. దేవుడు ఎవరో ఒకర్ని లేపుకుంటాడు. మోషే పోతే యెహోషువ రాలేదా?' అని చెప్పాడు. ఏనాడు తాను ఒక దైవజనుడనని తలంచలేదు. దేవుడు ఆత్మల్ని పట్టే భారాన్ని సహోదరుడిపై పెడితే, సహోదరుడు తన భారాన్ని దేవునిపై పెట్టాడు. అందువల్లే విశ్వవ్యాప్తంగా లక్షలాది ఆత్మల్ని పట్టాడు, సంఘాల్ని కట్టాడు. సహోదరుడి జీవిత ఆశయం దేవుణ్ణి ఘనపరచడం. ఆత్మల్ని పట్టడం. ప్రతి సంవత్సరం పరిశుద్ధ సమాజ కూడికలు ముగిసిన తరువాత సహోదరుడు ఖేడ్గాం వెళ్ళేవాడు. టెలిఫోన్, పోస్టల్ సౌకర్యాలు వుండని ప్రాంతంలో సహోదరుడు తన ఏకాంత ప్రార్ధనకు పండిట రామాబాయి మిషన్ దగ్గర ఎటువంటి ఆటంకాలు వుండవని వెళ్ళి ప్రశాంతంగా పది రోజులుండి వచ్చేవాడు.

సహోదరుడు భక్తసింగ్ పరిచర్య ఒక సుడిగాలి. ఆ దినాల్లో సహోదరుడి పరిచర్యను దేశవిదేశాల్లోని మారుమూల ప్రాంతాలకు సైతం వ్యాపించింది. ఫ్రాన్స్‌దేశంలో బ్రదర్ వర్బ్రాన్ ఫ్రెంచి, జర్మని భాషల్లో సహోదరుడి సాక్ష్యాన్ని ఇతర పుస్తకాల్ని అనువదించాడు. సహోదరుడి సాక్ష్యానికి సంబంధించిన ఫ్రెంచి పుస్తకం న్యూకాలిడోనియా ఐలాండుకు చేరింది. అది ఫ్రెంచి కాలని. ఆ చుట్టు ప్రక్కల కమ్యూనిస్టు దేశాలు వున్నాయి. అక్కడ అనేకమంది బ్రదర్ భక్తసింగ్ పుస్తకాల్ని చదివి బ్రదర్ వర్బ్రాన్‌న్ని ఆహ్వానించారు. అప్పుడు న్యూకాలిడోనియాలోని అనేక ఇళ్ళలో బ్రదర్ భక్తసింగ్ ఫోటోలు వుండటం బ్రదర్ వర్బ్రాన్ చూశాడు. సహోదరుడు భక్తసింగ్ సాక్ష్యంలో జీవ ముంది, శక్తి వుంది. అందువల్లే అనేకమందిని ఉజ్జీవింప జేసింది.

సంఘాల్లో అనైక్యత వుండటం గమనించినప్పుడు వాళ్ళ కొరకై ప్రార్థించేవాడు. 'వాగ్వివాదం వలన సమస్యల్ని తీర్చలేము కాని అంధకార శక్తుల్ని బంధించడం ద్వారా సమస్యల్ని తీర్చుకుంటాము' అని బ్రదర్ అనేక సంఘాల్లో ఉపదేశించాడు. పెళ్ళిళ్ళకు చావులుకు ఎక్కువమంది కూడుతుంటారు కాబట్టి అటువంటి సందర్భాల్లో సహోదరుడు సువార్త కొరకు సమయాన్ని బాగా వాడుకుంటాడు.

సహోదరుడు భక్తసింగ్ కూడికలకు ప్రజలు వచ్చి వాళ్ళ అక్కర్ల నిమిత్తం, వ్యాధుల నిమిత్తం, ఆత్మీక్షేమం నిమిత్తం ప్రార్ధించమని చీటీలు వ్రాసి ఇచ్చేవాళ్ళు. బ్రదర్ వాటినన్నిటిని జాగ్రత్తగా దాచి, విరామ సమయాల్లో ప్రతి ఒక్కరి కొరకు ప్రార్ధించేవాడు. ఇతరుల క్షేమం కొరకు ప్రార్ధించే భారము ప్రభువు నుండి పొందాడు. ఒకసారి నల్గొండలో సువార్త ఉజ్జీవ కూడికలు జరిగాయి. ఆ రోజు నలభై సంవత్సరాల అనుభవం కల ఒక మిషనరీ పాస్టర్ బెంజమిన్ బ్రదర్ కూడికకు వచ్చాడు. ఆ పాస్టరుకు చాలా మంచి పేరు వుంది. ఆ దినం సహోదరుడు ఉపదేస్తుంటే ఆ పాస్టరు విని అక్కడే పశ్చాత్తాపపడి తన పాపాల్ని ఒప్పుకొని తిరిగి జన్మించాడు. తరువాత తాను నలభై సం॥లు వేషధారణ జీవితం కలిగి ప్రభువుని తెలియకుండా జీవితాన్ని వ్యర్ధం చేసుకున్నట్లు ఆ మిషనరీ సంస్థ పెద్దలకు తెలిపి, తన పాస్టరుగా రాజీనామా చేసి ప్రభువు కొరకు నమ్మకంగా జీవించాడు. ఈ విధంగా బ్రదర్ అనేక మంది క్రైస్తవులను నిజక్రైస్తవులుగా మార్చినాడు. ప్రభువు హస్తం ఆయనకు తోడుగా వుండటం వల్ల తన సేవ బహుగా ఫలించింది.

ఆంధ్రప్రదేశ్‌లో తన సంఘాలులేని తొలి రోజుల్లో సహోదరుడు ఒకరోజు మద్రాసుకు వెళ్తున్న సమయంలో తెనాలిలో రైలు ఆగింది. వందలాదిమంది విశ్వాసులు సహోదరుణ్ణి కలిశారు. ఆ సమయంలో ప్రభువుని అంగీకరిం చిన రైల్వే కార్మికులు ఒళ్ళంతా దుమ్ము కొట్టుకొని చాలా సంతోషంలో బ్రదర్‌ని కలిశారు. బ్రదర్ వాళ్ళకి దుమ్ము వుందని కూడా అనుకోకుండా ఎంతో ప్రేమానురాగాలతో కౌగలించుకున్నాడు. ఆయనలో నిజమైన ప్రేమను చూడగలం. అయితే రైలు అక్కడ ఆగవలసిన సమయం కంటే పదినిమిషాలు ఎక్కువ సమయం ఆగడం గమనించ తగ్గ విషయం.

# హన్నాకృప

## 9వ వార్షికోత్సవ

# పాఠకుల సదస్సు

**తేది : 13 సెప్టెంబర్ 2008**

**స్థలము : ది అన్‌డినామినేషనల్ చర్చ్ ఆఫ్ ది లార్డ్ చర్చి**

**కృపాదానంవీధి, క్లౌపేట, ఒంగోలు**

పాఠకులందరికీ మా
హృదయపూర్వక ఆహ్వానము.

**చందా పంపదలచిన వారు :**
(S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా
పంపవచ్చును.

నెం.**10957294362**
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఒంగోలు
కె. సామ్యేల్ రాజేంద్ర



సాక్ష్యము

# షేక్ జయనాభి

మా తండ్రిగారి పేరు షేక్ జాని, తల్లిదండ్రులకు ఏకైక కుమారుడను. స్వగ్రామము గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా భట్టిప్రోలు. నా తల్లి పేరు జయనాభి. నా తండ్రి రైసుమిల్లు మేస్త్రీగా పని చేస్తూ దుర్వ్యసనాలకులోనై ఇంటిని నిర్లక్ష్యం చేశాడు. వారికి ఇద్దరు ఆడపిల్లలు ఇద్దరు మగపిల్లలు సంతానం.

ఇంట్లో పోషణ సరిగా లేనందున నా తల్లి వ్యాధి గ్రస్తురాలైనది. చెరుకుపల్లెలో ఖాదర్‌ఖాన్ అనే వైద్యుని దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకుంది. మా తండ్రిగారి అశ్రద్ధ వలన మందులు సరిగా కొనలేక పోషణ లేక ఆమె వ్యాధితో మంచం పట్టింది. తాను లేచి ఏ పని చేయలేని పరిస్థితుల్లో వుంది.

మా అమ్మమ్మ అప్పుడప్పుడు రేపల్లెలోని బేతపూడిలో తన ఇంటిలో వుంచుకొనేది. ఇలా ఏడు సంవత్సరాలు గడిచాయి. మా అమ్మమ్మ దోసెలు అమ్మేది. వాళ్ళకు దగ్గర్లోని ఒక క్రైస్తవ ఇంట్లో వ్యాధిగ్రస్తుడైన ఒక బాబు మరణించే స్థితిలో ఉన్నాడు. మరలా ఒక నెల తర్వాత అదే ఇంటి వద్ద ఆ బాబు ఆడుకుంటూ ఆరోగ్యంగా వున్నాడు. మా అమ్మమ్మ వారి బిడ్డ ఎలా బాగయ్యాడని అడిగితే వారు 'అమ్మా, యేసయ్య జీవముగల దేవుడు. మేము ఆయనను ఆచార యుక్తముగా ఆరాధించాము. ఇంత కాలానికి కాని బిడ్డ కొరకు మేము అందరం వారం రోజులు ఉపవాసం వుండి, మా పాపములను ఒప్పుకొని పాస్టరుగారిని పిలిపించాము. ఆయన వచ్చి బిడ్డ కొరకు నూనె వ్రాసి ప్రార్థన చేశారు. అప్పుడే మా బిడ్డ బ్రతికి ఆరోగ్యవంతుడయ్యాడు' అని చెప్పారు. మా అమ్మమ్మ మా అమ్మని యేసుప్రభువు స్వస్థపరచగల శక్తిగల వాడని తెలిసినా మతం వాళ్ళకి భయపడి ప్రార్థనకు తీసుకొని పోలేదు. మా అమ్మ ప్రార్థనకు తీసుకొని వెళ్ళమన్నా తీసుకొని వెళ్ళలేదు.

ఖాదర్‌ఖాన్ డాక్టరుగారు కూడ ఇన్ని సంవత్సరాలు జబ్బుతో వుండి మరణించనైనా మరణించాలి, లేదా బాగుపడాలి కాని ఈ కేసు అర్థం కాలేదు అన్నారు. మా తండ్రి మంగళగిరి దగ్గర ఒక స్పెషలిస్టు దగ్గరికి తీసుకొని వెళ్ళాడు. ఆయన దగ్గర మందులు వాడితే బాగుపడటమో మరణించటమో జరుగుతుందని నమ్మకము. ఆ డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఈమె బ్రతుకదు తీసుకొని వెళ్ళమన్నాడు.

ఇంటికి వచ్చిన తర్వాత మా అమ్మమ్మ మా అమ్మని తీసుకెళ్ళని చోటు లేదు. సముద్రముకు కూడా మొక్కింది. దర్గాల వద్దకు తీసుకొని వెళ్ళింది. దేవాలయాలలో మొక్కు బడులు చేసింది. నాగపూర్ పుట్టల దగ్గర చేయించింది. కాని యేసు దగ్గరికి మాత్రం తీసుకొని వెళ్ళలేదు. ఎందుకంటే లోకంలో మనం ఏంచేసినా ఎవరూ పట్టించుకోరు కాని యేసును విశ్వసిస్తే ఒప్పుకోరు.

ఒకరోజు ఆదివారం కేటంవారిపాలెంలో ఒక మాంత్రికుని చూడవెళ్ళింది. నడవలేని స్థితి అయినా పది సంవత్సరాల వయసున్న సుభాని మా అన్నని వెంటబెట్టుకొని పది గజాల దూరం నడిచి, కొంచెంసేపు విశ్రాంతి తీసుకొని దాదాపు రెండు మైళ్ళు వెళ్లింది. కాని ఆ మాంత్రికుడు ఊరు వెళ్ళాడు. నిరాశగా వెనుతిరిగింది.

ఇల్లు ఇంకా ఒక కిలోమీటరు దూరం వుండగా, ఎక్కడో వాద్యములు పాటలు వినిపించాయి. యేసయ్య ప్రార్థన ఇదే కాబోలు అని అనుకుంటూ అటు వెళ్ళింది. చర్చీలో ప్రార్థన జరుగుతుంది. భయపడుతూ వెళ్ళి వెనుక వైపున చాటుగా కూర్చుంది. అస్తిపంజరంవంటి ఆమె ఆకారం, పైపెచ్చు మెడలకు, చేతులకు అంత్రములు, తాయెత్తులు, వికార రూపం చూస్తే ఎవరైనా భయపడతారు. కాని ఎవరో అన్నారు చిన్నగా అంత్రాలతో గుడిలోకి రాకూడదు. వెంటనే చేతులకు, మెడకు ఉన్నవన్నీ తీసి కొంగులో పెట్టుకొని కూర్చుంది.

మొద్దుకూరి ప్రేమయ్యగారు వాక్యం చెప్తున్నారు. ఆయన కుష్టువ్యాధిని గురించి, తర్వాత పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తిని యేసును చేరలేక ఇంటి పైకప్పు విప్పదియించుకొని యేసు దగ్గరికి పరుపుతో సహా దింప బడితే యేసయ్య వారిని కోపపడకుండా ప్రేమతో స్వస్థపరచాడు అని బోధించాడు. వాక్యం విన్న మా అమ్మ, ఇటువంటి ప్రేమగల దేవుడే నన్ను కూడ స్వస్థపరచగలడు అని విశ్వసించి ఇంటికి వచ్చింది. కొంత శక్తి ఆమె శరీరంలో ప్రవేశించి ఎంతో ఆదరణ లభించింది.

ప్రక్క వీధిలో వున్న ఒక ముస్లీం స్త్రీతో తన సాక్ష్యము చెప్పింది. ఆమె భర్త పేరు దాదా. ఆమె ఎంతో సంతోషించింది. ఆమె కూడా తన సాక్ష్యము చెప్పింది. తను మూడు సంవత్సరాల నుండి కుష్టు వ్యాధితో రహస్యంగా బాధపడుతుండగా ఒకరోజు

హన్నమ్మ అనే సువార్తికురాలు యేసుని ప్రేమ గురించి చెప్పి నూనె వ్రాసి ప్రార్థన చేసిందని. అలా కొంతకాలం ఆమె ప్రార్థన చేస్తుండగా తను కూడా యేసును నమ్మి ప్రార్థన చేయుట ద్వారా స్వస్థత పొందాను అని చెప్పింది. నాటినుండి హన్నమ్మ గారి వాక్యపరిచర్యలో ప్రార్థనలో యేసునందు విశ్వాసంలో అభివృద్ధి చెంది నా తల్లి జయనాభి 1980లో పూర్తి స్వస్థత పొందింది.

1981 డిసెంబరు 17వ తేదీన నేను జన్మించాను. నేను పుట్టినప్పుడు సువార్తికురాలు హన్నమ్మగారు వచ్చి యేసుప్రభువు జన్మదినమునకు ఏడురోజుల ముందు నీ కొడుకు జన్మించాడు కనుక బాప్తిస్మమిచ్చు యోహానువలె దేవుని సేవకుడవుతాడు అని చెప్పింది. మా అమ్మ ప్రార్థనకు వెళ్ళాలంటే ముస్లీం బజారుగుండా నడవాలి. ఆమె ప్రార్థనకి వెళ్తుంటే అందరూ కులం తక్కువది అని సూటి పోటి మాటలతో బాధించేవారు. అయినా ఆమె సహించింది.

నేను పుట్టిన తర్వాత రెండు సంవత్సరాలకు ఇంటి వద్ద కుటుంబ ప్రార్థన పెట్టించింది. ఆ ప్రార్థన అయిపోయిన తర్వాత ముస్లీం మత పెద్దలు వచ్చి ఇలా ప్రార్థనలు పెట్టుకోకూడదు. మేము పవిత్రంగా ఉంటాము అని మా అమ్మను మందలించి, బైటకు రాకుండా చేశారు. అప్పుడు మా తండ్రి ఇంటి వద్ద లేడు. తరువాత ఆయన వచ్చి నా భార్య ఏ దోషము చేయలేదు. స్వస్థపరచిన యేసుని నమ్ము కున్నది ఆయన స్వస్థపరచాడు. అది తప్పా అని అడిగి నిల బడ్డాడు. మరి రెండు సంవత్సరాలు కులం వాళ్ళు వలస చాలా బాధలు పొంది అక్కడి ఇల్లు అమ్మి వేరే చోట స్థలము కొనుక్కుని ఇల్లు కట్టుకున్నాము.

ఆ తరువాత అంతా అలజడి లేకుండా జరిగిపోయింది. మా పెద్ద అక్క పెళ్ళి మా పెద్దమ్మ వారి ఊళ్ళో జరిగింది. మా రెండవ అక్క తాజ్‌కు వివాహం నిశ్చయం అయింది. మా తండ్రి కులపెద్దలను ఆహ్వానించ వెళ్తే నీ భార్య క్రైస్తవురాలైంది కనుక మిమ్ములను సంఘంలో నుండి వెలివేశామని. మీకు స్మశాన భూమిలో కూడ స్థలము లేదని అన్నారు.

అయినా మా తండ్రి వారితో కొంతసేపు మాట్లాడిన తర్వాత నీ భార్య మసీదుకు వచ్చి ఖురాన్ మీద ప్రమాణం చేసి క్రైస్తవ్యము వదలుకుంటే వస్తామని అన్నారు. ఎక్కడైనా స్త్రీ మసీదుకు వస్తుందా? కావాలంటే నా భార్య తరపున నేను ప్రమాణం చేస్తానని మా తండ్రి వారి యెదుట ప్రమాణం చేశాడు. పెండ్లి జరిగిపోయింది. తరువాత ఆరు నెలలకు మా పెద్దన్న మూస పెండ్లి జరిగింది.

రెండు నెలలు మా అమ్మని ప్రార్థనకు పోకుండా ఆపాడు మా తండ్రి. మా ఊర్లో జాన్‌శాస్త్రిగారు మీటింగులు పెట్టారు. మా అమ్మ ఆ మీటింగులకు వెళ్ళింది. ఇది తెలిసి మా తండ్రి మీటింగు వద్ద నుండి మా తల్లిని కొట్టుకుంటూ ఇంటికి తీసుకొచ్చాడు. మా పెద్దనాన్న ఈ సంగతి విచారింప వచ్చి నప్పుడు మా తల్లి, నేను రోగిష్టిగా వుండి యేసు దయవలన స్వస్థత పొంది ఆయనను ప్రార్థించినప్పుడే నన్ను ఆపి వుండవలసింది, నేను అప్పుడు చస్తే చచ్చేదానను. బ్రతికితే బ్రతికే దానను కాని ఇలా కొంతకాలం ఆయనను కొలిచి, ఇప్పుడు యేసయ్యను వదలలేను అని అంది. అప్పుడు మా తండ్రి మా కుటుంబం విడిచి వేరు వున్నాడు.

నాకు పది సంవత్సరాలప్పుడు సున్తీ చేశారు. తర్వాత నలభై రోజులు బలమైన ఆహారం ఇవ్వాలి. అప్పటికి మమ్మును పోషించే భారము తీసుకున్న మా అన్నకు చాలా కష్టమని పించింది. ప్రభువునందు విశ్వాసంతో మా అమ్మ, మా అన్న వద్ద నుండి వేరుగా కాపురం ఏర్పాటు చేసింది. కనుక నాకు పన్నెండు సంవత్సరాల వయస్సు నుండి బేల్దారు పనికి వెళ్ళి కూలి తెచ్చేవాడను. ఆదివారాలు పోవద్దని మా అమ్మ చెప్పింది. అయినా వెళ్ళే వాడను. అప్పుడు నాకు అనారోగ్యం వచ్చింది. అప్పుడు మా తల్లి ఆదివారం గుడికి తప్ప ఎక్కడికి వెళ్ళను, దశమభాగం తప్పక తీసేటట్టుగా ఒప్పించగా నాకు ఉపశమనం కలిగింది.

చిన్నతనం నుండే నాకు టైలరింగ్ అంటే ఇష్టం అందు కని నేను టైలరింగ్‌లో చేరాను. అలా రెండు సంవత్సరాలు గడిచింది. టైలరింగ్‌లో దాదాపు 40 మంది ముస్లీంలు నాతో ట్రైనింగ్ చేస్తూ నాతో మతం గురించి మాట్లాడేవారు. ఎందుకంటే ముస్లీం అయి యేసుని నమ్ముకున్న వారు ఆ ప్రాంతంలో నేను తప్ప ఎవరూ లేరు. అయితే వారి ప్రశ్నల న్నింటికి సరైన సమాధనం ప్రభువు నాకందించేవాడు.

ఒకరోజు ప్రక్క వూరు నుండి ముస్లీం మతగురువు వంటి ఆయన నా వద్దకు వచ్చి చాలా విషయాలు చెప్పారు. ముస్లీం మతం పవిత్రత గురించి చాలా విషయాలు మాట్లాడి మీ అమ్మ కాలం అయిపోయింది. క్రైస్తవ మతం వలన చాలా బాధలు పడింది. ఇప్పుడు ఆ బాధలు ఎందుకు పడాలి?

యేసు మంచివాడే. దేవుని ప్రవక్త అని మేము నమ్ముతాము. కాని ఆయనను కొలిచే వారి కంటే మనం పవిత్రంగా మసీదులో ప్రార్థన చేస్తాము అని చాలా చెప్పాడు. నేను కూడా ఆయన చెప్పే వాటన్నిటినీ ఒప్పుకున్నాను. తర్వాత యేసుని నమ్ముకొని చనిపోతే నరకానికి పోతావు అని చెప్పాడు. ఆయన ఒక గంటసేపు నాతో మాట్లాడాడు. నేను ఏమి బదులు చెప్పలేదు కాని ఇప్పుడు మీరు చనిపోతే పరలోకానికి పోతారా? అని అడిగాను. అందుకు ఆయన నేను చనిపోయే టప్పుడు మహమ్మద్ చెప్పిన సురా పిలికితే చాలు నేను గ్యారంటీగా పరలోకానికి పోతాను, కావాలంటే రాసిస్తాను అన్నాడు. అందుకు నేను పరలోకం నీది, నాది కాదు దేవునిది. మీరు మశీదులో వున్నంతసేపు ఎలా వుంటారో అలానే బయట కూడ నీతిగా వుండండి. కాని మీరలా వుండటం లేదే అని, మీరు మీ కంటిలో వున్న దూలాన్ని గమనించక మా కంటిలో వున్న నలుసు చూస్తున్నారు. సరే మీరైనా నేనైనా పరలోకం చేరాలి కదా! మనిద్దరం కలుసుకుందాము అని చెప్పి వచ్చేశాను.

ఆ మధ్యాహ్నం నేను అన్నం తినలేదు. మనసు బాగాలేదు. రాత్రి తొమ్మిది గంటలకు ఇల్లు చేరాను. మా అమ్మ భోజనానికి రాలేదేమి అని అడిగింది. అప్పుడు నేను చాలా బాధతో 'అమ్మా నువ్వు యేసును నమ్ముకొని చాలా శ్రమలు అనుభవించావు. సరే నీ కాలం అయిపోయింది. తర్వాత మమ్ములను కూడా ఆ శ్రమలు అనుభవించేటట్లు మమ్ములను కూడ ఈ ప్రార్థనలో ఎలా పెట్టావు? అయిన వారితో పాటు కలసి మెలసి వుండలేని విధంగా చేశావు' అని నా హృదయంలో వున్న వేదన అంతా వెళ్ళబోసు కున్నాను. మా అమ్మ అంతా విని 'నాయనా, నువ్వు వయస్సులో చిన్నవాడివి. చిన్నతనంలోనే నా మాట విని ఇంతవరకు నీ తోటి పిల్లలవలె పాడైపోకుండా బుద్ధిమంతుడవై యేసు ప్రభువును ప్రార్థించి జీవించావు. ఇప్పుడు పెద్దవాడివయ్యావు కదా! నీ యిష్టం నీకు ఏది యధార్థమో, ఏది మాన్యమో అది స్వీకరించు. నా కొరకు చూడవద్దు. నేనైతే యేసయ్యను వదలి జీవించలేను' అంది.

తర్వాత యధాప్రకారం అన్నం తిని నేను, మా తమ్ముడు, అమ్మ ప్రార్థనకి కూర్చున్నాము. కీర్తన పాడిన తర్వాత నేను బైబిలు తెరిచాను. కీర్తనల గ్రంథము 58వ కీర్తన మీద నా కళ్ళు నిలిచాయి. "అధిపతులారా, మీరు నీతి ననుసరించి మాట్లాడుతున్నది నిజమా?" అని చదివాను. ఆ మాటలు ఎవరో పెద్దగా నా చెవిలో చెప్తున్నట్లు అనిపించింది. "నరులారా! మీరు న్యాయమునుబట్టి తీర్పు తీర్చుదురా?" ఆ మాటలు నన్ను అడిగినట్లుగా వుంది. "లేదే, మీరు హృదయ పూర్వకముగా చెడుతనము జరిగించు చున్నారు". నాతో మాట్లాడిన ముస్లీం పెద్ద గుర్తుకొచ్చాడు. ఆయన జీవితం నాకు తెలుసు. "దేశమందు మీ బలాత్కారము తూచి చెల్లించు చున్నారు. తల్లి కడుపున పుట్టినది మొదలుకొని భక్తిహీనులు విపరీత బుద్ధి కలిగియుందురు. పుట్టినతోడనే అబద్ధములాడుచు తప్పి పోవుదురు" అలా చదువుతూ ఏడుస్తున్నాను. తర్వాత మా తల్లి దగ్గరకు వెళ్ళి క్షమాపణ అడిగాను.

నా తల్లి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. నిజమే, ఇప్పుడు నాకు పదిహేడు సంవత్సరాలు. నా ఈడు వారు దాదాపు ఇరవైఐదుమంది నాతో కలసి ఈ ఊళ్ళో టైలరింగ్ చేస్తున్నారు. వీరందరిలో నేను యోగ్యమైన జీవితం జీవిస్తున్నాను. నా జీవితాన్ని ఇంతవరకు యేసు నడిపించాడు. ఇక అలా కాదు, నా జీవితాన్ని ఆయనకు పూర్తిగా అర్పించుకొని ఆయన సేవ చెయ్యాలనుకున్నాను. నాకు, మా అమ్మకు ఆత్మీయ తల్లి హన్నమ్మగారు వృద్ధాప్యం వలన మంచాన పడ్డారు. ఆమె 30 మంది రెడ్డి కులస్తులను, ఇతరులను ప్రభువులోనికి నడిపించి సంఘము నడిపిస్తున్నారు. ఆమెకు నేను ఇంతకాలం కొంత సహకారిగా వున్నాను. ఇప్పటి నుండి ఆమె పనులన్నింటిని నేనే చేయాలని నిశ్చయించు కున్నాను.

గాస్పల్ ఫర్ ఏషియా సంస్థలో (హైదరాబాద్‌లో) శిక్షణ పొంది మా ఊర్లో సేవ చేస్తున్న స్నేహితుడు నా వద్దకు వచ్చి నీవు సేవ చెయ్యాలని నిశ్చయించుకుంటే కొంత శిక్షణ అవసరము అని తను చదివిన సంస్థలో చేర్పించాడు. అక్కడ రెండు సంవత్సరాలు పూర్తి చేసి శిక్షణార్థము ఒంగోలు వచ్చి ఒక ఇల్లు అద్దెకు తీసుకొని సర్వే చేస్తుండగా ఏ.బి.యం. కాలేజీలో జరుగుతున్న ప్రార్థన కూటములకు వచ్చాము. అక్కడ గాస్పల్ ఫర్ ఏషియా విద్యార్థి జాన్ మోజస్ బుక్‌స్టాల్ పెట్టియున్నాడు. ఆయన ఒంగోలు 'హన్నాకృప' మాస పత్రిక ఎడిటర్‌గారి వద్ద వుంటున్నానని చెప్పి, వారికి నన్ను పరిచయం చేశారు. దేవునికి స్తుతి, మహిమ, ఘనత కలుగును గాక! ఆమేన్.

# వారి బాటలో..... 1

భారతదేశానికి మొట్టమొదటి పాశ్చాత్య మిషనరీలు దక్షిణాదిన పడమటి తీరములో పోర్చుగీసు వారు వ్యాపార రిత్యా వచ్చి కొంతమంది రోమన్ కేథలిక్ మత గురువులను ఆ ప్రాంతానికి తీసుకొచ్చినట్లు చరిత్ర చెప్తుంది. తరువాత డచ్చి వారు వ్యాపార రిత్యా తూర్పు తీరంలో వచ్చి భీమునిపట్నం లోను, మచిలీపట్నంలోను వారి వ్యాపార గిడ్డంగులను స్థాపించారు. అదే సమయంలో బ్రిటీష్ వారు ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా వ్యాపారమే ధ్యేయంగా పెట్టుకొని చెన్నపట్నం, కలకత్తావంటి కోస్తా ప్రదేశములలో గిడ్డంగులను స్థాపించి వ్యాపారము చేయుచుండిరి. వారు క్రైస్తవులైననూ దేవుని ప్రేమ సందేశము, ఆ ప్రాంతంలో వివరించడానికి సంశయించేవారు. వ్యాపార ధోరణిలో వచ్చిన వారు అప్పటి మొగలాయి పాలనలో పాలకులకు ఇబ్బంది కలుగుతుందే మోనని లేక వారిలో వ్యాపారము చేయుచున్న హిందూ ధనవంతులు ఈ క్రైస్తవ సూక్తులు వ్యాపార అభివృద్ధికి ఆటంకములు అవుతాయేమో వారు పూర్తిగా సేవను విస్మరించారు.

బాప్టిస్టు పితామహుడు శ్రీ విలియంకేరి కలకత్తా ప్రాంతంలో సేవ ప్రారంభించాడు. అప్పటి బ్రిటీష్ పాలకులు ఎన్ని అవరోధాలు తెచ్చినను పట్టుదలతో సేవ చేశాడు. ఒంగోలు ప్రాంతంలో అమెరికన్ బాప్టిస్టు మిషన్ వారు రెవ. సామ్యూల్ డేగారిని 1935లో తెలుగు ప్రాంతములో సేవ చేయుటకు పంపించారు. వీరితో సహా రెవ. జాన్ బేట్స్, ఆంటిరియా (కెనడా)లో నివశిస్తూ తెలుగు ప్రాంతంలో సేవ చేయుటకు ఆశపడ్డారు. రెవ. ఆర్.ఏ. ఫైఫ్, కెనడాలో పాస్టర్‌గా చేస్తూ కెనడియన్ బాప్టిస్టు వారి ఆధ్వర్యంలో తెలుగు ప్రాంతంలో సేవ చేయుటకు ఆశించిరి. అదే సమయంలో థామస్ గబ్రియేల్ అను ఒక క్రైస్తవుడు కాకినాడ టెలిగ్రాఫ్ ఆఫీస్‌లో పని చేస్తుండేవాడు. దేవుని సేవ చేయాలన్న భారముతో తను చేయుచున్న పనికి రాజీనామా చేసి ఉత్తర సర్కారులో తెలుగు వారి మధ్య సేవ చేయుటకు 1873లో కెనడా మిషన్ బోర్డు వారికి ఉత్తరము వ్రాసి ఉత్తర ఆంధ్రాలో తెలుగు వారి మధ్య సేవ చేయుటకు వారి సహాయం కోరెను. వారు ఆ ఉత్తరానికి స్పందించి జాన్ మెక్. లారిన్ అనే మిషనరీని 1874లో కాకినాడ పంపించి థామస్ గబ్రియేల్‌తో సహకరించి ఉత్తర ఆంధ్రాప్రాంతంలో సేవ చేయుటకు ప్రారంభించారు.

బొబ్బిలి ప్రాంతంలో మొట్టమొదటి ప్రాశ్చాత్య క్రైస్తవ మిషనరీలు 1874లో సేవ ప్రారంభించారు. సుదీర్ఘ సముద్ర ప్రయాణము కావినిచి ఎన్నో కష్టనష్టాలు భరించి భీముని పట్నం ఓడరేవులో చర్చిల్ దొరగారు వారి సతీమణి దిగి అక్కడ నుండి బొబ్బిలి పట్టణానికి వచ్చారు. ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు ఏమియు లేవు. ఎడ్లబండితో సామాన్లు తెచ్చి జినీ రక్షాలో వారిద్దరు బొబ్బిలి చేరారు. ఈ జినీ రిక్షా ప్రస్తుత రిక్షావలెనే వుండి నాలుగు చక్రాలు వుండి ముందు ఇద్దరు లాగుతుంటే వెనుక ఇద్దరు త్రోసుకు పోయేవారు. భీమునిపట్నం నుండి బొబ్బిలికి ఆ దినాల్లో సరైన రహదారి లేక మెల్లగా రెండు దినాలు ప్రయాణం చేశారు.

చర్చిల్ దొరగారు వచ్చి అప్పటి బొబ్బిలి రాజావారిని కలిసి కొంత స్థలాన్ని లీజుకు తీసుకొని అక్కడ గుడారం వేసుకొని సేవ ప్రారంభించారు. కొంతకాలమైన తరువాత నివాసమునకై మంచి గృహము కట్టాలనే ఉద్దేశ్యంతో మరలా బొబ్బిలిరాజా వారిని కలప సహాయం చేయమని అడిగారు. మీరు అడవిలోకి వెళ్ళి మీకు ఇష్టమైన పెద్ద చెట్లు కొట్టుకొన వచ్చునని రాజా వారు అనుమతి ఇచ్చారు. కొంతమంది కూలి వారిని తీసుకొని ఎడ్లబండ్లతో అడవిలోనికి వెళ్ళి మంచి కలపను ఎంచుకొని కొట్టించి దాన్ని పెద్ద రంపాలతో సైజులు చేసి బొబ్బిలి తీసుకు వచ్చేవారు. చర్చిల్ దొరగారు తమ సేవ గూర్చి వ్రాసిన పుస్తకంలో ఈ విధంగా వ్రాశారు. ఒకరోజు అడవిలో కూలి వాళ్ళు తెచ్చుకున్న అన్నం ఉట్టిలతో కట్టి చెట్టు కొమ్మకు వేలాడి తీశారట. ఇంతలో చర్చిల్ దొరగారు అటువైపు వెళ్తే ఆయన వేసుకున్న టోపి తలకు ఆ ఉట్టి తగిలినది. వెంటనే ఆ కూలివాడు వచ్చి ఆ ఉట్టి కుండలోనున్న అన్నమును తీసి అవతలకు విసిరేశారట. దొరగారు ముట్టుకోవడంతో అది మైలు అయిపోయిందని ఆ విధంగా చేశారు. అదేకాక ఆయా గ్రామాల్లో సేవకై వెళ్ళినపుడు కూడా

వీరికి ఇటువంటి దుర్ఘటనలు జరిగాయని వ్రాశారు. చర్చిల్ దొరగారికి ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు వుండేవారు. అమ్మాయి పేరు ఎలిజబెత్.

బొబ్బిలి రాజా వారి సహాయంతో కలప దొరికినందుకు వారు చాలా సంతోషించారు. ఇటుకలు వారి స్వహస్తాలతో అచ్చులుగా తయారు చేసి కొంతమంది కూలి వారి సహాయంతో తమ స్వహస్తాలతో ఇటుకలు తయారు చేశారు. కొంతకాలానికి ఒక చక్కటి గృహాన్ని నిర్మించుకొని తమ పిల్లలతో కలసి వుండేవారు. కొన్ని గ్రామాలు గుర్రాలపై వెళ్ళి సువార్త ప్రకటించిన తరువాత కొంతమంది విశ్వాసులు యేసుప్రభువును అంగీకరించారు. ఆయా గ్రామాల్లో విద్య లేకపోయి నశించి పోవడం గమనించి పదకొండు మంది అమ్మాయిలతో 1896లో బాలికల వసతి గృహము ప్రారంభించారు. అదే నేటి సి.బి.యం. బోర్డింగ్ హోమ్ స్కూలుకు బిల్డింగ్ లేకపోవడం వలన చర్చిలో స్కూలు నడిపేవారట. ప్రస్తుతం వున్న బొబ్బిలి బాప్టిస్టు చర్చిలో 1895 ఆగష్టులో ప్రారంభించారు. చర్చి కట్టుటకు స్థలము కొరకు ప్రయత్నించినపుడు ఎవరూ అమ్మడానికి సిద్ధపడలేదు. అప్పుడు పట్టణంలో ఒక ముస్లీం కుటుంబము తాలూకు గృహసముదాయాన్ని కొని, కట్టడాలు కూల్చివేసి అదే ప్రదేశంలో దేవాలయము కట్టిరి. ఆ సమయంలో 15 మంది సభ్యులే వుండేవారు. ప్రస్తుతం అదే దేవాలయంలో సులభంగా 300 మంది కూర్చోవచ్చును. వారి యొక్క దూరదృష్టి ప్రభువు సేవను అభివృద్ధిపరచవలెననే నిరీక్షణ, ఆ దేవాలయము పూర్తిగా సభ్యులతో భవిష్యత్తులో నిండుతుందనే విశ్వాసము ఎంతో శ్లాఘనీయమైనది. ఇప్పుడు అదే దేవాలయంలో 600 మంది కూర్చొని ఆరాధించుచున్నారు.

కొన్ని దినముల తరువాత వారి ఇద్దరు అబ్బాయిలు చక్కగా దేవునిలో నానాటికి అభివృద్ధి పొంది చక్కటి క్రైస్తవ అనుభవంలో పెరుగుతుండేవారు. అమ్మాయి ఎలిజబెత్ తమ స్వదేశంలో చదువుకుంటూ వుంది. ఇంతలో పెద్దబ్బాయికి టైఫాయిడ్ జ్వరం సోకి, సరైన వైద్యసదుపాయం లేక ప్రభువునందు నిద్రించాడు. అప్పుడు ఆ అబ్బాయిని తన స్వహస్తాలతో మిషన్ కాంపౌండులో భూస్థాపితం చేశాడు. కొంత కాలమైన తరువాత రెండవ అబ్బాయి కూడా కలరా వ్యాధి వచ్చి మరణించాడు. ఈ అబ్బాయిని కూడా పెద్దబ్బాయి సమాధి ప్రక్కనే సమాధి చేశాడు. వీరి సమాధులు ఇంకనూ మిషన్ కాంపౌండులోనే వున్నాయి.

దేవుని కొరకు స్వదేశం వదిలి, కష్టనష్టాలు భరించి, స్వంత బిడ్డలను కోల్పోయి ఎంతో కృంగిపోవలసిన పరిస్థితులలో దొరగారు ధైర్యంతో ఇక్కడ సేవ కొనసాగాలనే ఆసక్తితో ఈ దేశంలోనే సేవ చేయబూనారు.

బొబ్బిలికి 45 మైళ్ళ దూరంలో రాయగడ అనే ప్రదేశం వుంది. అక్కడ కూడా బాప్టిస్టు సభ్యులు వుండేవారు. వారి కొరకు ఒక దేవాలయము కట్టడం ప్రారంభించారు. ఒకరోజు దేవాలయము నిర్మించుచున్న సమయంలో దొరగారు ఒక పెద్ద దూలం భుజము మీద వేసుకొని నిచ్చెన ఎక్కుచుండగా నిచ్చెన విరిగిపోయి దొరగారు పడిపోయారు. ఆ బరువైన దూలము ఆయన తొడపై పడి వెన్నెముక విరిగి పోయింది. అక్కడ సరైన ప్రథమ చికిత్సగాని, వైద్య సదుపాయాలు లేక వారిని ఎడ్ల బండిలో బొబ్బిలి తీసుకు వచ్చారు. 45 మైళ్ళ ప్రయాణంలో ఎడ్లబండిలో ఆయన ఎంత చిత్రహింస పడ్డారో ఆ దేవునికే ఎరుక. బొబ్బిలి వచ్చిన తరువాత కొంతమంది డాక్టర్లు వచ్చి చూసి, అప్పటికే పరిస్థితి విషమించిందని గమనించి అక్కడికి కాలు తీసేయాలని నిర్ణయించారు. అప్పటికే ఆయన దేహమంతా విషమయం అయిందని డాక్టర్లు అపరేషన్ చేస్తుండగానే ఆయన మరణించారు. అప్పుడు ఆయన దేహాన్ని కూడా ఆయన ఇద్దరు కుమారుల సమాధి ప్రక్కనే భూస్థాపితం చేయడమైనది. తరువాత కొంతకాలము చర్చిల్ దొరగారి భార్య బోర్డింగ్ సేవను కొనసాగించారు.

స్వదేశంలోనున్న ఎలిజబెత్ తన తండ్రి మరణానంతరం వచ్చిన ఇన్సూరెన్సు డబ్బుతో స్త్రీల మధ్య పనిచేయుచున్న మిషనరీస్ లేడీస్‌కు తగు వసతి లేదని ఆ డబ్బుతో ఒక మంచి గృహాన్ని 1911 సం॥లో కట్టించింది. అదే ప్రస్తుత లేడీస్ (మహిళల) బంగళా.

తన జీవితాన్ని దేవుని సేవ కొరకు ధారపోసిన మిషనరీలలో చర్చిల్ దొరగారు మొట్టమొదటి వారని చెప్పవచ్చును. వారి తరువాత ఎంతో మంది మిషనరీలు ఈ ప్రాంతానికి వచ్చి సేవ చేశారు. అవనిగడ్డ నుండి ఇచ్ఛాపురం వరకు కెనెడియన్ బాప్టిస్టు మిషన్ ఇట్లువంటి సేవా దృక్పధంతో పనిచేసిన మిషనరీల ద్వారా సేవ ఫలించింది.

(ఇంకా వుంది)

## క్విజ్ ఆగష్టు నెల ప్రశ్న ? 46

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. **'గుఱ్ఱముల గుదికాలి నరములు తెగవేసెన'ను కార్యములోని ఉద్దేశ్యమేమి?**
2. **ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం ఇశ్రాయేలీయులు అరణ్యములో నడచినది ఎన్ని సంవత్సరములు?**
3. **కనానులో లేవి గోత్రమునకు ఇవ్వబడిన స్వాస్థ్యము ఏది?**

**జవాబుల కొరకు యెహోషువ 7వ అధ్యాయం నుండి 24వ అధ్యాయము వరకు చదవండి**

**ఆగష్టు నెల ప్రశ్నలకు జవాబులు :**

1. ఆదామనే ఊరు ఎచ్చట కలదు?

జవాబు : సారెతాను వద్ద. యెహో. 3:16

2. ఇశ్రాయేలీయులలో సున్నతి కార్యము ఎంత కాలము జరుగలేదు?

జవాబు : నలుబది సంవత్సరములు. యెహో. 5:5-7.

**సరియైన జవాబు వ్రాసిన వారు :**
**శ్రీమతి యం. సత్యవతి, నెల్లూరు**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాదు**
**శ్రీమతి పి.జె. సత్యవాణి, తెనాలి**
**శ్రీమతి సంపూర్ణ సాల్మన్, నర్సరావుపేట**
**శ్రీమతి బి.ఎ. లాజరస్, నిడదవోలు**
**శ్రీమతి ఆలూరి నిర్మలదేవి, ఒంగోలు**

**ఈ నెల పోషకులు :**

| | | | | | |
|---|---|---|---|---|---|
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాద్ | 2000 | రెవ. వి.వి.కె. శర్మ | బొబ్బిలి | 300 |
| శ్రీమతి విమలా రాజేశ్వరరావు | సామర్లకోట | 1000 | శ్రీ పట్నాయక్ | విశాఖపట్నం | 300 |
| డా॥ పి. హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 | శ్రీమతి రత్నకుమారి | ఇబ్రహీంపట్నం | 300 |
| రెవ. డా॥ యం.యస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 | శ్రీమతి విక్టోరియా | విశాఖపట్నం | 300 |
| శ్రీ రెవ.వి.విజయకుమార్ | బొబ్బిలి | 1000 | శ్రీ గాబ్రియేల్ | విజయవాడ | 200 |
| శ్రీమతి కాంతిరాణి | గుంటూరు | 1000 | శ్రీ కోటిలింగారావు | టంగుటూరు | 200 |
| శ్రీ పి. గ్రేషియస్ | ఏలూరు | 1000 | శ్రీమతి సౌభాగ్యమ్మ | ఒంగోలు | 200 |
| శ్రీమతి ఈ.వి. రాజకుమారి | నెల్లూరు | 500 | శ్రీ భగవంతరావు | బేస్తవారపుపేట | 150 |
| అపో. ఎబినెజరు | హైదరాబాద్ | 500 | శ్రీ శ్యాంబాబు, కంటోన్మెంట్ | విశాఖపట్నం | 150 |
| డా॥ బాబూడేవిడ్ లివింగ్‌స్టన్ | మార్కాపురం | 500 | శ్రీ దివాకర్ | హైదరాబాద్ | 150 |
| శ్రీ విజయకిషోర్ | విశాఖపట్నం | 500 | పాస్టర్ జోసఫ్ కిషోర్ | చిలంకూరు | 150 |
| రెవ. బి. శ్యాంసన్ | ఒంగోలు | 500 | శ్రీ దామోదరం | హైదరాబాద్ | 150 |
| రెవ.డా॥ ఎబినెజర్ | విజయవాడ | 500 | | | |

## ఎస్.యం.ఎస్. పరిచర్య



**ఎవరైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభి లాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు **ఎ.యన్.ఆర్.జక్కంగారు** ప్రతినెల రూ. 1000/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.



# ప్రయాణంలో మజిలీ

బొబ్బిలి సి.బి.యం. అధినేతగా వున్న రెవ. విజయ కుమార్‌గారు జూలైనెల 16న ఫోన్ చేసి ఆగష్టు 1వతేదీన బొబ్బిలి వచ్చి 3వ తేది ఆదివారం చర్చిలో వాక్యము చెప్ప మన్నారు. సమయం సరిపోనందున 1వ తేది రాత్రి ఒంగోలులో బయలుదేరి ఉదయం సామర్లకోటలో దిగాను.

జూలైనెల ప్రయాణంలో మజిలీలో వ్రాసిన విమలమ్మ గారిని చూడవలెనన్న తలంపుతో వారింటికి వెళ్ళాను. విమలమ్మ గారు విట్టికర్ గరల్స్ స్కూల్ హెడ్‌గా వున్నప్పుడు మూడు సంవత్సరాల క్రితం ఒక్కసారే వారిని చూశాను. అది కూడా స్కూలు ఆవరణలో. తర్వాత వారు తరచుగా 'హన్నాకృప'కు ఆర్థిక సహాయం చేసేవారు. ప్రస్తుతం వారు రిటైరయ్యారు. నేను వారింటికి వెళ్ళినప్పుడు ఆమె భర్తగారు డోకల గిరినాథ్ రాజేశ్వరరావుగారు ఇంట్లో వున్నారు. ఆయన బ్యాంకు మేనేజరుగా వుండి రిటైరయ్యారు.

చక్కని పూలతోట, రకరకాల పండ్లతోటల మధ్యలో ప్రభువు కృపతో వున్న వారిని చూచి ప్రభువును స్తుతించాను. రాజేశ్వర రావుగారి తాతగారు రామస్వామిగారు సామర్లకోట షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తూనే ఆత్మల రక్షణార్థము గొప్ప సేవ చేశారు. వారి సేవా ఫలితంగా విట్టకర్ గరల్స్ స్కూలు గుర్తు ప్రభువు నంగీకరించి గొప్ప సేవకుడయ్యాడు.

ఆ సాయంత్రం నన్ను ఆయన స్కూటర్ మీద పట్టణంలోని అనేక ప్రాంతలలో ప్రారంభమున మిషనరీలు ఎలా సేవ చేసింది, మాసిలామణిగారు చదివిన హాస్టలు, స్కూలు చూపిం చారు. ఆ రాత్రి వారి దగ్గర సెలవు తీసుకొని రాత్రి రెండు గంటలకు విజయనగరం చేరాను. తెల్లవారి మూడు గంటలకు మరొక రైలులో బొబ్బిలికి తెల్లవారి నాలుగు గంటలకు చేరాను. ఆరు గంటలకు బొబ్బిలికి మూడు కిలోమీటర్ల దూరంలో 17 ఎకరాల మామిడి తోట మధ్యలో, ఒక ఎకరం ఆయుర్వేద వైద్య మొక్కలు, అన్ని రకాల పూల, పండ్లమొక్కలు, పండ్ల చెట్లకు తోడుగా పాడి ఆవులు, పావురాల గుంపుల మధ్యన పదిమంది వృద్ధులకు ఆశ్రమం నిర్మించి వారి కొరకు చిన్న మందిరం కట్టించి, తన కొరకు ఒక ఇల్లు కట్టుకొని నివసిస్తున్న శ్రీ వింజమూరి విమల్ కుమార్‌శర్మ గారింటికి వెళ్ళాను.

ఆయన పెద్ద కుమారుడు సుకుమార్‌గారు విజయనగరం దగ్గర నీలాయమ్మ సత్రం దగ్గర అనాథాశ్రమము, చర్చీ కట్టి తన కుటుంబముతో సేవ చేస్తున్నారు. వింజమూరి విమల్ కుమార్‌శర్మగారి పూర్వీకుల నుండి వారిద్దరి కుమారుల వరకు వారి సాక్ష్యము 2006లో హన్నాకృపలో నాలుగు నెలలు ప్రచురించాము.

రెండు సంవత్సరాల క్రితం విజయకుమార్‌గారి ఇంటి వద్ద పదినిమిషాలు మాత్రమే వారిని చూశాను. తర్వాత వారిని చూడలేకపోయాను. ఆ దంపతులు చాల చిన్న వయస్కులుగా కనిపించి ఇంకా సంతానము కలుగలేదు అనుకున్నాను.

మేము వారికి హన్నాకృప పంపకపోయినా ఒక సంవ త్సరం క్రితం 1000 రూపాయలు హన్నాకృపకు పంపిం చారు. ఇప్పుడు వారి ఆహ్వానం మేరకు బొబ్బిలి వచ్చాను. ఆది వారం వారి చర్చిలో వాక్యపరిచర్య జరిగించాను. సోమవారం ఉదయం టామ్‌కాక్స్ కాంపౌండ్ నుండి (వి.వి.కె.శర్మగారి నివాసం) బొబ్బిలిలోని సి.బి.యం. కాంపౌండుకు మకాం మార్చారు.

ఆ సి.బి.యం. కాంపౌండులో విజయకుమారు దంపతులు ఉదయం నుండి రాత్రి పది గంటల వరకు వివిధ బాధ్యతలలో తలమునకలై వున్నారు. వారి పరిచర్యను పూర్తిగా చూడటానికి నాలుగు గంటలు పట్టింది. విజయకుమార్‌గారి భార్య వసంత కుమారి రాత్రి పదిగంటలకు వారు నడిపిస్తున్న అనాథ శరణా లయం వైపుగా వెళ్తున్నారు. 'ఎక్కడికమ్మా వెళ్తున్నారు' అని అడిగాను. 'అస్వస్థతగా వున్న పిల్లలకు రాత్రి ఈ సమయంలో చూడకపోతే ఈ రోజు నా పని పూర్తిగా ముగిసినట్లు కాదు' అన్నారు.

'మీరొక్కరే ఇంత కష్టపడాలా?' అన్నాను. 'మా అత్తగారు ఐరిస్ రాజితగారు చేసిన సేవలో నేనెంత మాత్రము సరిపోనండి. నేను ఈ శరణాలయంలోనే చదువుకొని ఈ ఇంటి కోడలినై మా అత్తగారి దగ్గర తర్ఫీతు పొందాను' అన్నారు. బొబ్బిలికి సేవార్థము వచ్చిన చర్చిల్ యవనస్తులైన ఆయన ఇద్దరు కుమారుల సమాధులు ఆ కాంపౌండులో చూచినప్పుడు మన కంట నీరు రాకమానదు.

ఆగష్టు మొదటి తారీఖున విజయకుమార్ జన్మదినమును పురస్కరించుకొని విశాఖపట్నం నుండి వచ్చిన వారి తోడల్లుడు పట్నాయగ్‌గారి, వారి సతీమణి జయకుమారిగారి కుటుంబంతో సహవాసం నాకు దేవుడిచ్చిన ఆశీర్వాద ఘడియలు.

మరునాడు ఉదయం విజయకుమార్‌గారి ఆఫీసులో కూర్చుని మాట్లాడుకునేటప్పుడు 'మీ రచనలన్నీ ప్రింట్ అయ్యాయా?' అని అడిగారు. 'ఇంకా నాలుగు క్రొత్తవి, నాలుగు పాతవి మొత్తం ఎనిమిది పుస్తకాలు ప్రింటింగుకు సిద్ధంగా వున్నాయి' అన్నాను. 'అయితే నన్ను ఒక పుస్తకం ప్రింటు చెయ్యనివ్వండి' అని, నేను ఆశ్చర్యంలోనుండి తేరుకొనేలోపే ఇరవైఐదువేల రూపాయలు నాచేతికిచ్చారు.

# సువార్తలలోని యేసు కథ



డెబ్భైమంది శిష్యులు అన్ని ప్రాంతాల నుండి తిరిగి వచ్చారు. అందరూ సంతోషంగా వున్నారు. ఇంతకుముందు వారు ఎన్న గ్రామాలు పల్లెలు పట్టణాలు తిరిగినప్పటికీ వారు యేసుప్రభువు వెనుకనే వుండేవారు. ఇప్పుడు వారు యేసు లేకుండా వెళ్ళారు. కాని యేసు నామమును వెంట పెట్టుకొని వెళ్ళారు. మొదటిసారి అయినందున భయపడుతూ వెళ్ళారు. అయితే తిరిగి వచ్చేటప్పుడు జయోత్సాహముతో వచ్చారు. అందరూ ఒకే స్తుతితో వున్నారు. ఒక్కొక్కరు వారు వెళ్ళిన ప్రదేశాలు, చేసిన అద్భుత కార్యములు వివరిస్తున్నారు. ఈసారి శిష్యుల సంఖ్య పెద్దది. డెబ్భైమంది పైగా వున్నారు.

వారిలో ఒకరు "ప్రభువా, మీ పేరు చెప్పగానే దయ్యాలు కూడా మా మాటలకు లోబడ్డాయి" అన్నాడు. అప్పుడు యేసు అతనివైపు చూచి "సైతాను ఆకాశము నుండి మెరుపువలె పడిపోవడం నేను చూశాను. పాముల మీద నడవటానికి మీకు అధికారము ఇచ్చాను. శత్రువును జయించే అధికారం ఇచ్చాను. దయ్యాలు మీ మాట వింటున్నంత మాత్రాన ఆనందించకండి. మీ పేరు పరలోకంలో వ్రాయబడినందుకు ఆనందించండి" అన్నాడు.

ఆయన ఆత్మలో సంతోషిస్తూ తల పైకెత్తి "ఆకాశానికి, భూమికి ప్రభువైనట్టి ఓ తండ్రీ, నీకు స్తుతులు, నీవు ఈ విషయాలు చదువుకున్న విజ్ఞానవంతుల నుండి దాచి అమాయకులకు తెలియజేశారు. ఔను తండ్రీ ఇది నీ చిత్తము" అని అన్నాడు.

అప్పుడు ఆయనకు అబ్రాహాము తనను చూచిన సంగతి, దావీదు తనకు చూచిన సంగతి జ్ఞాపకమునకు వచ్చినవి. యోనా, యోవేలు తనను చూడాలని తపించి పోయారు. ఆసా, ఉజ్జీయా, సొలోమోను తనను చూడాలను కొని చూడలేకపోయిన సంగతి మననం చేసుకుంటూ "మీరు చూస్తున్నవి చూసే మీ కన్నులు ధన్యమైనవి. నేను చెప్పేదే మంటే, మీరు చూస్తున్నవి చూడాలని చాలమంది ప్రవక్తలు, రాజులు ఆశించారు. కాని చూడలేకపోయారు. మీరు వింటున్నవి వినాలని వాళ్ళాశించారు. కాని వినలేక పోయారు" అని రహస్యంగా వారికి చెప్పాడు.

ఒక సమాజమందిరంలో ప్రభువు నిలబడి మాట్లాడు తున్నాడు. ఆయన నిత్యజీవమును గరించి మాట్లాడి ముగించిన తర్వాత అక్కడ కూర్చున్న ధర్మశాస్త్ర పండితుడు ఒకాయన లేచి నిలబడి "బోధకుడా, నేను నిత్యజీవము పొందాలంటే ఏమి చెయ్యాలి" అని అడిగాడు.

"ధర్మశాస్త్రములో ఏమి వ్రాశారు? నువ్వు ఏమి చదివావు?" అని ప్రభువు అతనిని అడిగాడు.

"నీ ప్రభువైనటువంటి దేవుణ్ణి సంపూర్ణమైన మనస్సుతో సంపూర్ణమైన ఆత్మతో, సంపూర్ణమైన బుద్ధితోను శక్తితోను ప్రేమించు. అంతేకాక నిన్ను నీవు ప్రేమించుకున్నట్లు నీ పొరుగువాళ్ళని ప్రేమించు" అని వ్రాయబడి వుంది" అన్నాడు.

"నీవు సరియైన సమాధానము చెప్పావు. ఆ విధంగా నడుచుకో, నిత్యజీవితం పొందుతావు" అన్నాడు యేసు.

తను నీతిమంతుడని రుజువు చేసికోవడానికి అ పండితుడు "మరి నా పొరుగువాడెవడు?" అని యేసును అడిగాడు.

"ఆ రోజుల్లో ప్రయాణానికి బండ్లు తక్కువగా ఉప యోగించేవారు. యెరూషలేము నుండి యెరికో ప్రయాణం అక్కడ కూర్చున్న వారందరికీ తెలుసు. ఆ రెండు పట్టణాల మధ్య ఎన్నో కొండలు, లోయలు వున్నాయి. యెరూషలేము పట్టణము కొండ మీద కట్టబడింది. దాని చుట్టూ కూడా కొండలే. యెరూషలేము కంటే యెరికో పట్టణము సముద్ర మట్టానికి ఐదువేల అడుగుల లోతులో వుంది. యెరికో సముద్ర మట్టానికి రెండవేల ఐదువందల అడుగుల లోతులో యొర్దాను నది ఒడ్డున పడమటివైపున కట్టబడివుంది.

కనుక యెరూషలేము నుండి యెరికో బయలుదేరిన వారు క్రిందకు దిగివెళ్ళినట్లు ఆ మార్గములో ప్రయాణము చేయడమంటే ప్రమాదకరమే. ప్రమాదకరమని తెలిసీ కూడ ఒకడు ఆ దారిన వెళ్తుంటే దొంగలు అతని వస్త్రములు దోచుకొని ప్రాణంపోయేటట్లుగా కొట్టి వెళ్ళిపోయారు. అతని ప్రాణం అతనిలో వుంది. కాని ఎవరో ఏదో సహాయం చెయ్యకపోతే అతను మరణిస్తాడు.

యెరికో పట్టణంలో యాజకుల కుటుంబాలు చాల

వున్నాయి. వీరందరూ యెరూషలేము దేవాలయంలో దేవుని యాజకులే. యాజకత్వము జరిగించిన తర్వాత కాని యాజకత్వము చేయుటకో గాని, ఒక యాజకుడు వెళ్తూ ఆ పడి వున్న వానిని చూచాడు. కాని అతను ప్రక్కగా వెళ్ళిపోయాడు. అదే విధంగా దేవుని సేవా వృత్తిలో వుండే లేవీయుడు కూడా ఆ దారిన వెళ్తూ, చూచి ప్రక్కగా తొలగి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ముందు వెళ్ళిన యాజకుడు లేవీయుడు వారి వారి ఇళ్ళకుగాని, దేవాలయముకుగాని వెళ్తున్నారు. ఇప్పుడైతే ఒక సమరయుడు ఆ దారిన రావడం తటస్థించింది. అతను ఒక బాధ్యతగల ప్రయాణం చేస్తున్నాడు. అంటే అతను ఇంటి నుండి ఒక కర్తవ్యం మీద బయలుదేరాడు.

అతను పడి వున్న చోటికి వచ్చి అతని చూచినప్పుడు అతనికి చాల జాలి కలిగింది. అతని దగ్గరకు వెళ్ళి అతని గాయాల మీద ద్రాక్షారసం పోసి నూనె వ్రాసి, కట్లు కట్టాడు. ఆ తర్వాత తాను ఎక్కి వచ్చిన గాడిద మీదకు అతని చేర్చి ఎక్కించుకొని ఒక సత్రానికి తీసికొని వెళ్ళాడు. ఈ విధంగా అతనికి చాలా సాయం చేశాడు.

తను ప్రయాణమైపోతున్న పనిని వదలి ఆ రాత్రంతా అతని దగ్గరనే వున్నాడు. ఇప్పుడు అతని ప్రాణాపాయం పోయింది. కాబట్టి తను బయలుదేరిన ప్రయాణం ముగించు కొని మళ్ళీ రావచ్చు అని సత్రం యజమాని యొద్దకు వచ్చి, రెండు దేనారాలు ఇచ్చి, ఇతనిని జాగ్రత్తగా చూసుకో, ఇతని కోసం నేనిచ్చినదానికన్నా ఎక్కువ ఖర్చు చేయవలసివస్తే నేను తిరిగి వచ్చినప్పుడు ఆ డబ్బు నీకిస్తాను అని చెప్పి వెళ్ళి పోయాడు" అని ముగించాడు యేసు. ఇప్పుడు అక్కడ కూర్చున్న పండితుల వైపు చూస్తూ "దొంగల చేతుల్లో చిక్కిన వానికి ఈ ముగ్గురిలో ఎవరు పొరుగు వారు" అని అడిగాడు.

అప్పుడు ప్రశ్న అడిగిన ధర్మశాస్త్ర ఉపదేశకుడు "అతని పైన జాలిపడినవాడే" అన్నాడు.

"నీవు వెళ్ళి ఆలాగు చేయుము" అని యేసు అన్నాడు.

---

# ప్రయాణంలో మజిలీ

ఈ నెల 11వ తేది ఉదయం ఏడు గంటలకు బేస్తవారిపేటలోని డా॥ హుస్సేనయ్యగారిని చూచి తిరుగు ప్రయాణంమై 9-30కి బేస్తవారిపేట జంక్షన్ చేరాను. కనిగిరి ఆసుపత్రిలో పని వుండి 11 గంటలకు చేరాలి. కనిగిరికి పదిన్నర వరకు బస్ లేదన్నారు. ఏం చెయ్యాల్లో అర్థంకాక ప్రభువును ప్రార్థిస్తూ రోడ్డు ప్రక్కన నిలబడ్డాను. నా ఎడమవైపు తెల్లని పెద్ద కారు ఆగివుంది. అందులో నుండి భారి విగ్రహం కలిగి, తెల్లని దుస్తులు ధరించిన ఒకాయన దిగి ఎవరితోనో మాట్లాడు తున్నాడు. మాట్లాడటం పూర్తయ్యాక, ముందు డోర్ తీసి ఎక్కబోతుంటే నేను దగ్గరకు వెళ్ళి 'పొదిలి వెళ్తుందా' అని చిన్నగా అడిగాను. ఆయన నా వైపు చూచి, తలుపు తీసి బైటకు వచ్చి, వెనుక సీట్లో కూర్చున్న ఒకామెను ముందు సీట్లో కూర్చోమని చెప్పి, నన్ను వెనుక సీట్లో కూర్చోమని చెప్పి ఆయన నా ప్రక్కన కూర్చున్నాడు. ఆయనకు నేనెవరో తెలియనప్పటికీ నాకు ఎంతో విలువనిచ్చి నన్ను తన కారులో తీసుకొని వస్తున్నాడు. ఇది దేవుని ఏర్పాటే అయినా, మంచి పనులు మంచి వారితోనే ప్రభువు చేయిస్తాడు. ఆయన ఫోనులో ఎవరితోనో మాట్లాడు తుంటే నేను మౌనంగా కూర్చున్నాను.

తర్వాత నేను ఆయనతో 'సార్, నేనెవరో తెలియక పోయినా నా కోసం శ్రమపడి నన్ను కారులో ఎక్కించుకున్నారు ఎందుకు?' అని అడిగాను. 'జస్ట్ హ్యూమనిటీ' అన్నాడు ఆయన. నా విషయాలు అడిగారు. నా దగ్గరున్న 'హన్నాకృప' చూశారు. నా నవలలు రెండు ఆయనకిచ్చాను. ఆయన వాటిని తీసుకొని తిరగేసి, నా పేరు చూసి 'మీరు గవర్నమెంటు లెప్రసీ కంట్రోల్ యూనిట్లో డాక్టర్ హుస్సేనయ్యగారితో 1983 వరకు పనిచేసిన రాజేంద్రగారా?' అని అడిగారు సంతోషంగా. ఔనని చెప్పాను.

ఆయన కూడా లెప్రసీ యూనిట్లో పనిచేశారని, డిసెంబర్లో పదవీ విరమణ చేశారని, ఆ కార్యక్రమానికి తన స్వగ్రామమైన ప్రకాశంజిల్లా, కొమరోలులో జరిగిన పదవీ విరమణ కార్యక్రమానికి ఏడువేలమంది హజరయ్యారని కలెక్టర్ మొదలు జిల్లా పరిషత్ ఛైర్మన్, యం.పి. మొదలగు వారంతా హాజరయ్యారని తెలుసుకున్నాను.

హన్నాకృప పత్రికను తన ఇంటికి పంపమని అడ్రసు నాదెళ్ళ వెంకయ్యచౌదరి, యం.యస్సీ, కొమరోలు అని వ్రాసి యిచ్చారు. నేను కనిగిరి వెళ్ళాలని తెలుసుకొని, వారికి సంబంధించిన ఇంకొక కారుకు ఫోను చేసి, పొదిలి వచ్చి నన్ను కనిగిరి తీసుకొని వెళ్ళమని చెప్పారు. అంతమంచి మానవతా వాదికి దేవుడు ఆత్మీయ రక్షణ అనుగ్రహించాలని దేవుని ప్రార్థిస్తున్నాను.

# ఏది నిజము? ఏది అబద్ధము? 5

## (లోకానికి బైబిల్ సవాల్)

హేతువాదుని ప్రశ్న - 19

**ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి వచ్చిన నాటి నుండి దేవుడైన యెహోవాకు ఆలయము కట్టునప్పటికి ఎన్ని సంవత్సరములు గడిచిపోయెను?**

1రాజులు 6:1, 'అయితే ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో నుండి బయలుదేరి వచ్చిన నాలుగువందల ఎనుబదియవ సంవత్సరమందు, అనగా సొలొమోను ఇశ్రాయేలును ఏలిన నాలుగవ సంవత్సరమందు జీప్ అను రెండవ మాసమున అతడు యెహోవా మందిరమును కట్ట నారంభించెను.

అపొ.కార్య.13:18-22, 'యించుమించు నలువది ఏండ్ల మట్టుకు అరణ్యములో వారి చేష్టలను సహించెను. మరియు కనాను దేశములో ఏడు జాతుల వారిని నాశనము చేసి వారి దేశములను వీరికి స్వాస్థ్యముగా పంచి యిచ్చెను. ఇంచుమించు నాలుగు వందల ఏబది సంవత్సరములు ఇట్లు జరిగెను. అటు తరువాత ప్రవక్తయైన సమూయేలు వరకు ఆయన వారికి న్యాయాధిపతులను దయచేసెను. ఆ తరువాత వారు రాజు కావలెనని కోరగా దేవుడు బెన్యామీను గోత్రీయుడును కీషు కుమారుడునైన సౌలును వారికి నలువది ఏండ్ల వరకు దయచేసెను. తరువాత అతనిని తొలగించి దావీదును వారికి రాజుగా ఏర్పరచెను. మరియు ఆయన-నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని; అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చునని చెప్పి అతనిని గూర్చి సాక్ష్యమిచ్చెను'.

విమర్శ : పౌలు యొక్క ఎన్నిక ప్రకారము నిర్గమ. తర్వాత 595 సం॥లో జరిగి వుండాలి. 40+45+21 (సమూయేలు పరిపాలన) +40 (సౌలు పరిపాలన) +40 (దావీదు పరిపాలన) +4=595.

**జవాబు :** యెహోషువ 13:6, 'కావున నేను నీకాజ్ఞాపించినట్లు నీవు ఇశ్రాయేలీయులకు స్వాస్థ్యముగా దాని పంచిపెట్టవలెను'. ఆ విధంగానే ఇశ్రాయేలీయులు తమ వంతుల వారిగా కానాను పంచుకొనిరి.

ఇశ్రాయేలు గర్విష్టులైనందున యెహోవాకు విరోధముగా తమ నడవడి వున్నందున దేవుడు అన్యులను హెచ్చించి ఇశ్రాయేలుకు విరోధముగా లేపి బాధించగా, వారి మొర విని వారి రక్షణార్థము న్యాయాధిపతులను పుట్టించాడు. వారు దోచుకొను వారి చేత నుండి రక్షించారు. న్యాయా.2:16, 'ఆ కాలమున యెహోవా వారి కొరకు న్యాయాధిపతులను పుట్టించెను. వీరు దోచుకొను వారి చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షించిరి'. అటు తరువాత, ఇశ్రాయేలీయులు తమను పరిపాలించుటకు రాజు కావలెనని కోరగా సౌలును రాజుగా ఏర్పరచెను. సౌలు అల్లుడు దావీదు రాజయ్యాడు. 1రాజు.1:30 ఇశ్రాయేలుకు దావీదు కుమారుడు సొలొమోను రాజయ్యాడు. 1రాజు.6:1, 'అతడు (సొలొమోను) యెహోవా మందిరమును కట్టింప నారంభించెను'.

ఇశ్రాయేలు ఐగుప్తు నుండి బయలుదేరి వచ్చిన 480 సంవత్సరాల కాలంలో ఈ పై చెప్పబడిన సంఘటనలు జరిగినట్లు తెలుస్తుంది. అనగా కనాను దేశమును మోషే, యెహోషువలు జయించి అధిపతులకు పంచి ఇవ్వడం. అటు తర్వాత అన్యుల దోపిడి నుండి కాపాడుటకు న్యాయాధిపతులను పుట్టించి రక్షించడం. అటు తర్వాత ఇశ్రాయేలు కోరిక మేరకు సౌలును రాజుగాను, అతని తదనంతరం దావీదును, ఆ తర్వాత సొలొమోను రాజై యెహోవా మందిరము కట్టడము జరిగింది. ఈ యొక్క చరిత్రను, పాతనిబంధనలో చదివినపుడు 480 సంవత్సరాల కాలం పట్టింది. ఇదే విషయాన్ని అపొస్తలుల కార్యాలలో భయంకరమైన జనాంగముల మధ్య పై సమూయేలు గ్రంథమును రాజుల గ్రంథములలోని జరిగిన చరిత్రను సంగ్రహంగా పౌలు చెప్పటం అపొ.13:18-22లో నాలుగు మాటలలో చెప్పడం జరిగింది.

1. 40 సంవత్సరాల పాటుగా వారు ఎడారిలోనే త్రిప్పబడి అక్కడనే ఉండిరి.
2. దేవుడు కనానులోని ఏడు జాతులను నాశనం చేసిన తరువాత, వారు వారి ప్రాంతమును పంచుకొనిరి.
3. అటు తరువాత వారికి న్యాయాధిపతులు ఇవ్వబడెను.

ఇక్కడ పౌలు 480 సంవత్సరములు అని సుమారుగా

చెప్పెను కాని ఈయన పాత నిబంధన పుస్తకము చదివి చెప్పినది కాదు. ఇప్పటికి కూడా మనము సాధారణంగా చెప్తూ క్రీస్తు ప్రభువు 2000 సంవత్సరాలు ముందు పుట్టెనని చెప్తాము. అంతే పౌలు కూడా ఈ చరిత్రను గూర్చి ప్రసంగము క్లుప్తంగా ఇస్తున్నాడు. ఆయన యొక్క జ్ఞాపక శక్తిని బట్టి దీనిలో జరిగిన సంఘటనలు ముందుగా గాని లేక ఒకటి ముందు తరువాత మరొకటి చెప్పవచ్చును. కాబట్టి ఈ రెండు వాక్యాలు అసందర్భాలు ఏమి కావు.

హేతువాదుని ప్రశ్న – 20

**హత్యా, దోపిడి – ఆత్మఫలమేనా?**

న్యాయా. 14:19, 'యెహోవా ఆత్మ అతని (సమ్సోను) మీదికి రాగా అతడు అష్కెలోనుకు పోయి వారిలో ముప్పది మందిని చంపి వారి సొమ్మును దోచుకొని తన విప్పుడు కథ భావమును చెప్పిన వారికి బట్టలనిచ్చెను'.

గలతీ. 5:22,23, 'అయితే ఆత్మఫలమేమనగా, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము'.

**జవాబు :** అష్కెలోనులో వున్నవారు యెహోవా ఆత్మకు విరోధులు. కనుక నాటి నీతిని బట్టి పైన చెప్పిన రీతిగ మత్తయి 5:38, 'కంటికి కన్ను పంటికి పల్లు నెరవేర్చుగ సంసోనును వాడెను. నూతన నిబంధన కాలములో యేసు క్రీస్తు ఆత్మ ద్వారా పౌలు చెప్పిన ఈ ఫలములు క్షమాపణ గుణమును సూచించును. కనుక ఒకదానికొకటి సామ్యము లేదు. సంసోనును దేవుడు పుట్టించిన ఉదేశ్యమేమి? న్యాయా. 13:5-6. యెహోవా ఆత్మ ఫలమేమిటి? ఫిలిష్తీ యుల బానిసత్వము నుంచి విమోచించుటయే. శత్రుసైన్య ము మన భూభాగముపై దండెత్తి అల్లకల్లోము చేయుచు దేశ స్వాతంత్ర్యమునకు భంగకరముగ విజృంభించినపుడు వీరోచితముగ పోరాడి వారిని సమూలముగా వధించుట ఆత్మఫలము కాదందురా?

హేతువాదుని ప్రశ్న – 21

**విచారణ జరిగిందా? లేదా?**

1సమూ. 28:5-6, సౌలు ఫిలిష్తీయుల దండును చూచి మనస్సునందు భయకంపమునొంది యెహోవా యొద్ద విచారణ చేయగా యెహోవా స్వప్నము ద్వారానైనను ఊరీము ద్వారానైనను ప్రవక్తల ద్వారానైనను ఏమియు సెలవీయకుండెను'.

1దిన. 10:13,14, 'ఈ ప్రకారము (సౌలు) యెహోవా ఆజ్ఞ గైకొనక ఆయన దృష్టి యెదుట ద్రోహము చేసినందుకును, యెహోవా యొద్ద విచారణ చేయక కర్ణ పిశాలముల యొద్ద విచారణ చేయు దానిని వెదకినందుకును సౌలు హతమాయెను'.

**జవాబు :** యెహోవా యొద్ద సమాధానము దొరకనందున సౌలు కర్ణపిశాచాల వద్దకు వెళ్ళెను. యెహోవా సమాధానము ఈయకుండుటకు కారణమేమి? సంపూర్ణమైన విచారణ ఇందులో లేదు. కాబట్టి, విచారణ చేయనట్లుగా లెక్కించబడినది. సర్వసృష్టి యొక్క సంచలనము ఎరిగియున్న దేవుడు సౌలు యొక్క మనోభావములు ఎరుగకుండునా? ఎందుచేతనంటే సౌలు మనోనిగ్రహము లేనివాడు అనగా చంచలుడు. అందునుబట్టి దేవుడు సౌలుకు ఒక చిన్న పరీక్ష పెట్టినాడు. తాను ఊరకయుండుటయే ఆ పరీక్ష. వెంటనే సౌలు యొక్క బలహీనత బయటపడింది. ఫలితమేమి? కర్ణ పీశాచాలు చెప్పేవారి వద్దకు వెళ్ళాడు. ఎందుకు? వారైనా చెప్తారని. దైవాతిక్రమణకు జీతమేమి? 'మరణము'. దానినే దేవుడు సౌలునకు ఇచ్చాడు. అట్లుగాక తన అల్లుడైన దావీదును ఆశ్రయించినట్లైతే ప్రాణరక్షణ కలిగియుండేది.




# North East West South వార్తలు

## ఒరిస్సాలో క్రైస్తవులపై దాడులు - సజీవ దహనాలు

ఆగష్టు 23, ఒరిస్సా : ఒరిస్సా రాష్ట్రంలోని కంథమాల్ జిల్లాలో డిసెంబర్ 2007లో క్రైస్తవులపై దాడులకు కేంద్ర బిందువైన విహెచ్‌పి నాయకుడు స్వామి లక్ష్మానంద సరస్వతిని 30 మంది మావోయిస్టులు గత ఆగష్టు నెలలో హతమార్చారు. దీనిని ఆధారం చేసుకొనిన మత తీవ్రవాదులు ఆ నెపం క్రైస్తవులపై నెట్టి వారిపై దాడులకు శ్రీకారం చుట్టారు. సుమారు పన్నెండు జిల్లాలలో క్రైస్తవులపై దాడులు జరుగుచున్నాయి. కాని ప్రస్తుతం పూర్తి సమాచారం అందటం లేదు. రాష్ట్రం మొత్తం మీద మిషన్ ఆస్తులు, స్కూల్స్, చర్చీలు ధ్వంసం చేయబడ్డాయి. నూఅగావ్ అనేచోట ఒక నన్ అత్యాచారానికి గురైంది. రాయగడలో ఒక అనాధాశ్రమము తగుటబెట్టబడింది. బాగ్రా జిల్లాలో మరొక అనాధాశ్రమానికి నిప్పుపెట్టగా పిల్లలను రక్షించే సమయంలో ఒక యువతి సజీవదహనమైంది. సుమారు 20 చర్చీలు ధ్వంసం చేయబడ్డాయి. ఇంకా వెలుగులోనికి రాని అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

కంధమాల్ జిల్లాలోని రూపాగావ్ అనేచోట క్రైస్తవులకు చెందిన 50 ఇళ్ళకు హిందూ మత తీవ్రవాదులు నిప్పు పెట్టారు. ఈ సంఘటనలో ఒక అవిటి వ్యక్తి సజీవదహనమయ్యాడు. క్రైస్తవ వ్యాపార దుకాణాలు దోచుకోబడ్డాయి. వందల సంఖ్యలో క్రైస్తవులు అడవులలో తలదాచుకుంటున్నారు. పోలీసులు గ్రామాలలోనికిరాకుండా రోడ్లకు అడ్డంగా దుంగలు, రాళ్ళను తీవ్రవాదులు వేశారు.

ఒక పథకం ప్రాకరం 2007లో కంధమాల్ జిల్లాలో క్రైస్తవులపై దాడులు చేసిన హిందూ మత తీవ్రాదులు 2008లోనూ అదే జిల్లాలో తిరిగి దాడులు ప్రారంభించారు. ఈ విషయంలో ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైంది. భారతదేశంలో దాడులు చేస్తున్న సిమి, ఇండియన్ ముజాహిదిన్, లష్కర్-ఎ-తోయిబా, జైష్-ఎ-మహ్మద్, ఆల్‌ఖయిదాల కంటే ఈ హిందుమత తీవ్రవాద సంస్థలు ప్రమాదకరమైన సంస్థలు గనుక ప్రభుత్వాలు గ్రహించి ఈ సంస్థలపై పై సంస్థలవలె నిషేదం విధించవలసి ఆవస్యకత ఎంతైనా వుంది.

## ఒంగోలులో పాస్టర్ మధ్య చీలికకు యస్.సి. పాస్టర్ల కుట్ర

ఒంగోలు టౌన్ డినామినేషన్ చర్చస్ యూనియన్ ఆధ్వర్యంలో గత దశాబ్దకాలంగా ఐక్యంగా ఉంటున్న పాస్టర్లు, నాయకుల మధ్య యస్.సి. (హిందూ) పాస్టర్లు చీలిక దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. పేరుకు క్రైస్తవ పాస్టరు, గవర్నమెంటు వారి దృష్టిలో హైందవుడు. వారి పిల్లలు ఇప్పటికి కూడా యస్సీలే. ఈ హిందూ పాస్టర్లు సుమారు పది, ఇరవై సంవత్సరాల సేవా అనుభవం వున్నవారే. ఒంగోలుకు పడమరవైపు వుంటున్న ఒక బడా క్రైస్తవ నాయకుడు వీరికి ధన సహాయం చేసి ప్రోత్సహిస్తున్నట్లు, యూనియన్‌లోని కొంతమందికి ఒక్కొక్కరికి మూడు నుండి ఐదువేల వరకు డబ్బు ఆశ చూపి తమవైపు మొగ్గేటట్లు చేస్తున్నట్లు సమాచారం.మౌర్య హోటల్లో జరిగిన ప్రెసిడెంట్‌గారి విదేశీ ప్రయాణ వీడ్కోలు సభలో పాస్టర్ జేసుదాసుగారు దీని విషయంలో బహిరంగ ప్రకటన చేశారు. చీలికదిశగా వెళ్తున్న పాస్టర్లు (హైందవులు) 90 శాతం మంది యస్సీలు కావడం విశేషం.

## మైనారిటీ (బీ.సి.) క్రైస్తవుల పథాకాలలో యస్.సి. క్రైస్తవుల హల్‌చల్

ప్రభుత్వం తలపెట్టిన హోలీల్యాండ్ టూర్ ప్రోగ్రామ్ నిజమైన క్రైస్తవులకు దక్కే అవకాశం చాల తక్కువగా ఉందని క్రైస్తవ పండితులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ ఖజానాను, మైనారిటీ ఖజానాను, క్రైస్తవ పదవులను కొల్లగొడుతున్న యస్.సి.లు (గవర్నమెంటు రికార్డుల్లో పేరుకు, కులానికి, మతానికి హైందవులు) సమాజంలో మాత్రం క్రైస్తవులు, చర్చీ పెద్దలు. అటు యస్.సి. రిజర్వేషన్లు, ఇటు మైనారిటీ రాయితీలు. ప్రభుత్వం మైనారిటీ పథకాలకు యమ్మార్వో ఇచ్చిన ధృవపత్రమును ఖచ్చితమైన ప్రామాణికంగా పాటించాలని క్రైస్తవులు కోరుతున్నారు.